www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 06 | బుధవారం | 5 ఆగస్టు, 2026

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 9014966169

## థర్డ్‌పార్టీ బీమా లేకుంటే నో పెట్రోల్

6

- వాహనాలకు చెల్లుబాటయ్యే బీమా ఉంటేనే ఇంధనం ఇవ్వాలి
- కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన
- పైలట్ ప్రాజెక్టు రూపొందించాలని ఆదేశం

దేశంలో థర్డ్ పార్టీ బీమా లేకుండా పెద్ద సంఖ్యలో వాహనాలు తిరుగుతున్నాయంటూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు, చెల్లుబాటు అయ్యే బీమా లేని వాహనాలకు పెట్రోల్ బంకుల్లో ఇంధనం ఇవ్వకుండా పైలట్ ప్రాజెక్టు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంగళవారం ఆదేశించింది. ఇందుకు బీమా నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏఐ), రహదారుల రవాణా మంత్రిత్వ శాఖ (ఎంఓఆర్‌టిహెచ్) కలిసి కార్యాచరణ రూపొందించాలని సూచించింది.

## నీట్ లీకేజీలకు చెక్!

### పరీక్షల నిర్వహణలో సమూల సంస్కరణలు

- పరీక్షల భద్రత కోసం ఫోర్ట్రెస్ తరహా 10 దశల భద్రతా వ్యవస్థ
- ఏఐ, బ్లాక్‌చెయిన్‌తో ప్రశ్నాపత్రాల రక్షణకు చర్యలు
- సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్
- నందన్ నీలేకని నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్

2

నీట్ పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీ, ఇతర అక్రమాలకు పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు పరీక్షల నిర్వహణ విధానంలో సమూల మార్పులు చేపట్టినట్లు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. జస్టిస్ పీఎస్ నరసింహ నేతృత్వంలోని ధర్మాసనానికి విద్యాశాఖ సమర్పించిన అఫిడవిట్‌లో పరీక్షల భద్రత, పారదర్శకత, సంస్థాగత సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే చర్యలు అమలు చేస్తున్నట్లు పేర్కొంది. పరీక్షల నిర్వహణలో సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నామని కేంద్రం తెలిపింది. నందన్ నీలేకని అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్ మూడు నెలల్లో సంస్కరణలపై నివేదిక ఇవ్వనుంది.



## నీట్ పీజీ ప్రవేశాలపై సమగ్ర ఆడిట్

6

- డీజీహెచ్ఎస్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ
- లోపాల గుర్తింపు, పరిష్కారాలపై నివేదికకు ఎనిమిది వారాల గడువు
- కటాఫ్ తగ్గింపుపై సుప్రీంకు కేంద్రం సమాచారం

నీట్–పీజీ 2025 ప్రవేశాల ప్రక్రియలో కటాఫ్ పర్సంటైల్ తగ్గింపుపై దేశవ్యాప్తంగా వ్యక్తమైన అభ్యంతరాల నేపథ్యంలో, మొత్తం ప్రవేశ వ్యవస్థపై సమగ్ర అంతర్గత ఆడిట్ నిర్వహించేందుకు కేంద్రం చర్యలు ప్రారంభించింది. డీజీహెచ్ఎస్ అధ్యక్షతన 12మందితో కూడిన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు సుప్రీంకు తెలియజేసింది.



2

మంగళవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో సీఎంతో పాటు డీజీపీ సీవీ ఆనంద్, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, హోంశాఖ ప్రధాన కార్యదర్శి శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వీవీ శ్రీనివాసరావు, హైదరాబాద్ సీపీ సజ్జనార్, ఇతర పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా పోలీస్ రిక్రూట్‌మెంట్

- 7,437 పోస్టుల భర్తీలో ఎలాంటి లోపాలకు తావుండొద్దు
- ప్రశ్నాపత్రాల తయారీ నుంచి పరీక్షల ముగింపు వరకు కట్టుదిట్టమైన భద్రత
- తప్పుడు ప్రచారం, ఫేక్ వెబ్‌సైట్లపై సైబర్ పోలీసులు నిఘా ఉంచాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

> రాష్ట్రంలో చేపట్టనున్న పోలీస్ ఉద్యోగ నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి. ఇటీవల విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం 7,437 పోలీస్ పోస్టుల భర్తీకి సంబంధించి ఎలాంటి అవకతవకలు, జోక్యాలకు తావులేకుండా అన్ని చర్యలు చేపట్టాలి. నియామక ప్రక్రియలో ప్రతి దశను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలి. ఎలాంటి లోపాలు, అనుమానాలకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకత పాటించాలి. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, భద్రపరచడం, రవాణా, పరీక్షల నిర్వహణ వంటి ప్రతి దశలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలి.
>
> – ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా భారత్

### 2028–29 నాటికి అంచనాలన్నీ అధిగమిస్తుంది

- ఐఎంఎఫ్ అంచనాలను రాజ్యసభలో వెల్లడించిన నిర్మలా సీతారామన్
- తయారీ, సేవారంగాల బలోపేతంతో వేగవంతమైన వృద్ధి లక్ష్యం
- సర్ఫేసీ చట్టం కింద ఏడాదిలో రూ.32,466 కోట్లు వసూలు చేసిన బ్యాంకులు



**న్యూఢిల్లీ:** 2028–29 ఆర్థిక సంవత్సరం నాటికి భారత ఆర్థిక వ్యవస్థ ఐదు ట్రిలియన్ డాలర్ల మైలురాయిని అధిగమిస్తుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అంచనా వేసిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభలో వెల్లడించారు. ఐఎంఎఫ్ విడుదల చేసిన తాజా వరల్డ్ ఎకనామిక్ ఔట్‌లుక్ నివేదిక ప్రకారం, ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 5.1 ట్రిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశముందని ఆమె తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థను స్థిరమైన, సమగ్ర వృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం పలు కీలక రంగాలపై దృష్టి సారించిందని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపు, తయారీ రంగ విస్తరణ, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈలు) ప్రోత్సాహం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, లాజిస్టిక్స్ వ్యవస్థ బలోపేతం, పన్ను సంస్కరణలు, డిజిటలైజేషన్, నవకల్పన, నైపుణ్యాభివృద్ధి, ఇంధన భద్రత వంటి అంశాలతో సమగ్ర వృద్ధి వ్యూహాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. తయారీ రంగానికి ఊతమిచ్చేందుకు 'మేకిన్ ఇండియా', ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం, 'పీఎం గతిశక్తి', జాతీయ లాజిస్టిక్స్ విధానం వంటి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. సేవారంగంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల అభివృద్ధి, కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం, నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు.

ఇదే సందర్భంగా బ్యాంకుల రుణాల వసూళ్లకు సంబంధించి మరో ప్రశ్నకు సమాధానమిచ్చిన నిర్మలా సీతారామన్, 2024–25 ఆర్థిక సంవత్సరంలో సర్ఫేసీ చట్టం కింద రూ.1.03 లక్షల కోట్ల విలువైన 2.15 లక్షల కేసులు నమోదైనట్లు తెలిపారు. వాటిలో బ్యాంకులు రూ.32,466 కోట్లను వి జయవంతంగా తిరిగి వసూలు చేశాయని వెల్లడించారు.



## వర్షాలు పడకుండా హరీశ్ క్షుద్రపూజలు

2

- అరుంధతి సినిమా తరహా పూజలు నిర్వహించారంటూ ఆరోపణలు
- మా వద్ద ఆధారాలు ఉన్నాయి: పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్
- మార్చి 2, జూన్ 1న ఎక్కడ ఉన్నారో చెప్పాలని డిమాండ్

## కాంగోలో ఎబోలా విజృంభణ

6

- 1,700 మందికి పైగా మృతి
- వేగంగా విస్తరిస్తున్న మహమ్మారి
- 3,800కు పైగా కేసులు

## సర్కారు కార్యాలయాలకు టీ ఫైబర్

- సెప్టెంబర్ 1 నుంచి ప్రైవేట్ నెట్ సేవలకు చెక్
- ఒకే డిజిటల్ నెట్‌వర్క్‌తో ప్రభుత్వ నిధుల ఆదాయే లక్ష్యం
- గ్రామీణ ప్రాంతాలకు 'ఇంటింటికీ ఇంటర్నెట్' సేవలు విస్తరించాలి
- ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ–ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో టీ–ఫైబర్ సేవల విస్తరణపై మంగళవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. నిర్ణీత గడువులోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ–ఫైబర్ కనెక్టివిటీ అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించరాదని ఆదేశించారు. ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు అన్ని శాఖలను అనుసంధానించే ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలు ఉపయోగిస్తున్న టీ–స్వాన్ నెట్‌వర్క్‌ను నెల రోజుల్లో పూర్తిగా టీ–ఫైబర్‌కు మార్చాలని అధికారులకు గడువు విధించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక కనెక్టివిటీ

భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ–ఫైబర్ కనెక్టివిటీ కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో డిజిటల్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ ఇంటర్నెట్' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని శ్రీధర్‌బాబు కోరారు. గ్రామీణ ప్రాంతాల వరకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గడువులోగా నిర్దేశిత లక్ష్యాలను పూర్తిచేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధనకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



## నీటి ప్రవాహమే సమాధానం

2

- కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాధాన్యతను చాటుతోంది
- కాంగ్రెస్ దుష్ప్రచారాలు చేసినా రైతులకు వాస్తవాలు తెలుసు
- ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా గోదావరి జలాల ఎత్తిపోతలపై హర్షం

ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా గోదావరి జలాలు ఎదురెక్కుతున్న తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు, దుష్ప్రచారాలకు నీటి ప్రవాహమే సమాధానమని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తన ప్రాధాన్యతను మరోసారి నిరూపించుకుంటోందని తెలిపారు.



## నటి త్రిషపై అనుచిత వ్యాఖ్యలు

6

- మాజీ డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్, విడుదల
- రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే నిరసనలు
- తమిళనాట వేడెక్కిన రాజకీయాలు

## ఎర్ర సముద్రంలో భారత నౌకపై దాడి

6

- యెమెన్ తీరంలో మునిగిన భారత జెండా వాణిజ్య నౌక
- 13మంది భారతీయులు సురక్షితం
- దాడిని ఖండించిన భారత్





# లోక్‌సభలో గందరగోళం

- అప్రోప్రియేషన్ బిల్లు ఆమోదం తర్వాత రోజంతా వాయిదాపడ్డ సభ
- రామాలయ విరాళాల వ్యవహారం, విద్యార్థులపై పోలీసుల చర్యలపై విపక్షాల ఆందోళన

**న్యూఢిల్లీ:** రామాలయ విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, విద్యార్థులపై పోలీసుల చర్యలపై విపక్ష సభ్యుల నిరసనల మధ్య లోక్‌సభ మంగళవారం గందరగోళంగా సాగింది. అప్రోప్రియేషన్ (నెం.3) బిల్లును వాయిస్ ఓటుతో ఆమోదించిన అనంతరం సభను రోజంతా వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైన వెంటనే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విదేశీ పెట్టుబడులపై ఆదాయపన్ను నిబంధనలకు సంబంధించిన ఆర్డినెన్స్‌కు బదులుగా టాక్సేషన్ అండ్ అదర్ లాస్ (సవరణ) బిల్లు–2026ను ప్రవేశపెట్టారు. అయితే దీనిపై అభ్యంతరాలు తెలిపేందుకు నోటీసులు ఇచ్చిన విపక్ష సభ్యులు మాట్లాడలేదు. సభ ప్రారంభంలో ప్రశ్నోత్తరాల సమయం సజావుగా జరిగేలా సహకరించాలని స్పీకర్ ఓం బిర్లా సభ్యులను కోరారు. పార్లమెంట్ నినాదాలు చేయడానికి కాదని, దేశానికి అవసరమైన చట్టాలపై చర్చించి ఆమోదించే అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అని ఆయన అన్నారు. ప్రస్తుత వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ ఇప్పటికే ఐదు బిల్లులను ఆమోదించగా, వాటిలో మూడు రాజ్యసభ ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నాయి.

# 'గజిని' విలన్ ప్రదీప్ రావత్ కన్నుమూత

- క్యాన్సర్‌తో పోరాడుతూ 74 ఏళ్ల వయసులో తుదిశ్వాస
- లగాన్, గజిని, మహాభారత్ పాత్రలతో విశేష గుర్తింపు



**ముంబై:** బాలీవుడ్ సీనియర్ నటుడు ప్రదీప్ రావత్ (74) మంగళవారం క్యాన్సర్‌తో పోరాడుతూ కన్నుమూశారు. 'లగాన్', 'గజిని' చిత్రాలతో పాటు పలు టీవీ ధారావాహికల్లో నటించి ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయన మృతి పట్ల సినీ పరిశ్రమ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. టెలివిజన్‌లో ప్రసారమైన 'మహాభారత్' సీరియల్‌లో అశ్వత్థామ పాత్రతో ప్రదీప్ రావత్‌కు విశేష గుర్తింపు లభించింది. అనంతరం 'తహ్కీకాత్', 'చంద్రకాంత', 'యుగ్' వంటి సీరియళ్ల లో నటించారు. ఆమీర్ ఖాన్ నటించిన లగాన్‌లో దేవా పాత్ర, గజినిలో విలన్‌గా ఆయన నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. మేరీజంగ్, సర్ఫరోష్, ది హీరో: స్టోరీ ఆఫ్ ఎ స్పై, ఛావా తదితర చిత్రాల్లోనూ కీలక పాత్రలు పోషించారు. ఇక తెలుగు లో సై సినిమాతో గుర్తింపుపొందిన ఆయన ఆ తర్వాత ఛత్రపతి, దేశముదురు, రాజన్న, పూలరంగడు, బాద్‌షా, సౌఖ్యం, సరైనోడు, వీర, అల్లుడుశీను, లయన్, నాయక్, రగడ, బలాదూర్ వంటి సినిమాల్లో నటించారు. ఆయన మృతిపై సహనటులు, అభిమానులు సోషల్ మీడియాలో సంతాపం వ్యక్తం చేస్తున్నారు.



# అప్పటివరకు గాజాను వదిలివెళ్లం

- ముందుగా హమాస్ ఆయుధాలు అప్పగించాలి
- దేశ భద్రత, పౌరుల రక్షణకే తొలి ప్రాధాన్యం
- ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు
- అమెరికా ప్రతిపాదించిన ఒప్పందంపై అభ్యంతరం

**గాజా:** హమాస్ పూర్తిగా నిరాయుధీకరణ చెందే వరకు గాజాలో ప్రస్తుతం తమ సైన్యం ఆక్రమించిన ప్రాంతాల నుంచి ఉపసంహరణ ఉండదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. హమాస్ ఆయుధాలు అప్పగించడం, ఇజ్రాయెల్ దాడులు నిలిపివేసి గాజా నుంచి దశలవారీగా వెనక్కి వెళ్లడం వంటి అంశాలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ఒప్పంద ముసాయిదాపై ఇజ్రాయెల్‌కు అభ్యంతరా లు ఉన్నాయని తెలిపారు. అమెరికా పంపిన ముసాయిదాను తమ ప్రభుత్వం అంగీకరించలేదని, తమ సూచనలను ఇప్పటికే పంపినట్లు నెతన్యాహు చెప్పారు. ఇజ్రాయెల్ భద్రత, పౌరుల రక్షణ కోసం అవసరమైన అన్ని చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

### గాజాలో 112 మృతదేహాల వెలికితీత

ఇదిలా ఉండగా, 2023 నవంబరులో గాజా నగరంలోని సబ్రా ప్రాంతంపై జరిగిన వైమానిక దాడిలో శిథిలాల కింద చిక్కుకున్న మరో 112 మంది మృతదేహాలను సహాయక బృందాలు వెలికితీశాయి. వీరిలో 40 మంది చిన్నారులు ఉన్నట్లు గాజా సివిల్ డిఫెన్స్ తెలిపింది. ఇంకా 157 మృతదేహాలు శిథిలాల కిందే ఉన్నాయని వెల్లడించింది. హమాస్ ఆధ్వర్యంలోని గాజా ఆరోగ్య శాఖ గణాంకాల ప్రకారం, 2023 అక్టోబర్ 7 నుంచి కొనసాగుతున్న యుద్ధంలో ఇప్పటివరకు 73,377 మందికిపైగా పాలస్తీనీయులు మృతి చెందారు. కాల్పుల విరమణ అమల్లో ఉన్నప్పటికీ అప్పటి నుంచి కూడా 1,252 మంది మరణించినట్లు పేర్కొంది. గాజాలో ఇంకా వేలాది మంది శిథిలాల కిందే ఉండిపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

# కాంగోలో ఎబోలా

- 1,700 మందికి పైగా మృతి
- ఇప్పటివరకు 3,800కుపైగా కేసులు

**బునియా:** తూర్పు కాంగోలో ఎబోలా వైరస్ అత్యంత వేగంగా విజృంభిస్తూ తీవ్ర ప్రాణనష్టం కలిగిస్తోంది. ఇప్పటివరకు 3,802 కేసులు నమోదుకాగా, 1,707 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ప్రభుత్వ తాజా గణాంకాలు వెల్లడించాయి. మే 15న ప్రారంభమైన ఈ వ్యాప్తి ఇప్పటికీ గరిష్ఠ స్థాయికి చేరుకోలేదని ఆఫ్రికా సీడీసీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జీన్ కసేయా తెలిపారు. కొత్త కేసుల్లో దాదాపు 80 శాతం కాంటాక్ట్ ట్రేసింగ్ ద్వారా కాకుండా నేరుగా సమాజంలోనే వ్యాప్తి చెందుతున్నాయని ఆయన హెచ్చరించారు. ఈ వ్యాధికి కారణమైన బుండిబుగ్యో వైరస్‌కు ప్రస్తుతం ఆమోదిత వ్యాక్సిన్ లేదా సమర్థ చికిత్స అందుబాటులో లేదు. ఇటూరి ప్రావిన్స్‌లోనే దాదాపు 90 శాతం కేసులు నమోదయ్యాయి. అయితే మరో ఐదు ప్రావిన్స్‌లకు కూడా వ్యాధి విస్తరించింది. సాయుధ ఘర్షణలు, ప్రజల నిరాసక్తత, వైద్య సిబ్బందిపై దాడులు, నిధుల కొరత, వేతనాల చెల్లింపుల్లో జాప్యం కారణంగా వ్యాధి నియంత్రణ చర్యలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఇప్పటివరకు 100 మందికిపైగా ఆరోగ్య కార్యకర్తలు కూడా ఎబోలా బారిన పడినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) వెల్లడించింది. ఎబోలాకు సంబంధించిన రెండు కొత్త చికిత్సా విధానాలపై క్లినికల్ అధ్యయనం ఇటూరి ప్రాంతంలో ప్రారంభ మైంది. ఈ పరిశోధనలు విజయవంతమైతే వ్యాధి నియంత్రణకు కొంత ఊరట లభించే అవకాశముం దని నిపుణులు భావిస్తున్నారు.

# నీట్ లీకేజీలకు చెక్!

**న్యూఢిల్లీ:** నీట్ పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీ, ఇతర అక్రమాలకు పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు పరీక్షల నిర్వహణ విధానంలో సమూల మార్పులు చేపట్టినట్లు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. జస్టిస్ పీఎస్ నరసింహ నేతృత్వంలోని ధర్మాసనానికి విద్యాశాఖ సమర్పించిన అఫిడవిట్‌లో పరీక్షల భద్రత, పారదర్శకత, సంస్థాగత సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే చర్యలు అమలు చేస్తున్నట్లు పేర్కొంది. పరీక్షల నిర్వహణలో సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నామని కేంద్రం తెలిపింది. నందన్ నీలేకని అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్ మూడు నెలల్లో సంస్కరణలపై నివేదిక ఇవ్వనుంది. ఏఐ, బ్లాక్‌చెయిన్ సాంకేతికతతో ప్రశ్నాపత్రాల భద్రతను మరింత పటిష్ఠం చేయనున్నట్లు వెల్లడించింది. ప్రశ్నాపత్రాల ముసాయిదా తయారీకి ఇంటర్నెట్‌కు అనుసంధానం లేని (ఎయిర్–గ్యాప్డ్) ఏఐ వ్యవస్థను ఉపయోగిస్తున్నట్లు తెలిపింది. ప్రతి ప్రశ్నాపత్రం, ఓఎంఆర్ షీట్‌కు ప్రత్యేక సీరియల్ నంబర్ కేటాయించామని, వాటిని ఆరు పొరల ప్రత్యేక ప్యాకింగ్‌తో ఒకేసారి మాత్రమే తెరవగల తాళాలున్న స్టీల్ ట్రంక్‌లలో భద్రపరుస్తున్నట్లు వివరించింది. దీనిని అధికారులు ఫోర్ట్రెస్ నమూనా భద్రతా వ్యవస్థగా పేర్కొన్నారు.

### కఠిన శిక్షలు

పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ చట్టం–2026 ద్వారా ప్రశ్నాపత్రాల లీకేజీ, పరీక్షల్లో మోసాలకు పాల్పడిన వారికి గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1 కోటి వరకు జరిమానా విధించేలా చట్టాన్ని మరింత కఠినతరం చేసినట్లు కేంద్రం వెల్లడించింది. 2026 నీట్–యూజీ పేపర్ లీకేజీపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతున్నందున ఆ అంశంపై అఫిడవిట్‌లో ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేసింది.

### పకడ్బందీగా పోలీస్ రిక్రూట్‌మెంట్

ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్రంలో చేపట్టనున్న పోలీస్ ఉద్యోగ నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇటీవల విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం 7,437 పోలీస్ పోస్టుల భర్తీకి సంబంధించి ఎలాంటి అవకతవకలు, జోక్యాలకు తావులేకుండా అన్ని చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పోలీస్ నియామక ప్రక్రియకు భంగం కలిగించేలా కొన్ని రాజకీయ పార్టీలు, ఇతర శక్తులు ప్రయత్నాలు చేస్తున్నట్లు నిఘా వర్గాలు ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంతో ముఖ్య మంత్రి అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు ప్రభుత్వ, పోలీసు శాఖ ఉన్నతాధికా రులు పాల్గొన్నారు. నియామక ప్రక్రియలో ప్రతి దశను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, ఎలాంటి లోపాలు, అనుమానాలకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శ కత పాటించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, భద్రపరచడం, రవాణా, పరీక్షల నిర్వహణ వంటి ప్రతి దశలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించా రు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పరీక్షల నిర్వహణకు ముందు, తర్వాత కోచింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, సామాజిక మాధ్యమాలు, ఇతర వేదికల ద్వారా తప్పుడు ప్రచారం, పుకార్లు వ్యాప్తి చెందకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలకు పాల్పడే దళారులు, నకిలీ వెబ్‌సైట్లు, నకిలీ సోషల్ మీడియా ఖాతాలపై సైబర్ క్రైమ్ విభాగం ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. నియామక ప్రక్రియ పూర్తయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ విభాగాలు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, హోంశాఖ ప్రధాన కార్యదర్శి శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ సజ్జనార్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సమస్యలపై దశలవారీ పోరాటం

ప్రజానావ, హైదరాబాద్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం దశలవారీ ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) నిర్ణయించింది. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సంఘం నాయకులు భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలన్నీ విద్యారంగ సమస్యలేనని, వాటి పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారుల వైఖరి కారణంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు క్రమంగా బలహీన పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డిమాండ్ల సాధన కోసం దశలవారీ పోరాటాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆగస్టు 7న పాఠశాలల్లో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పీఆర్సీ ప్రకటించే వరకు ప్రతిరోజూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని కోరారు. ఆగస్టు 12, 13 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించి తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, ఆగస్టు 29న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి మహాధర్నా చేపట్టనున్నట్లు వెల్లడించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వేలాది మంది ఉపాధ్యాయులతో చలో అసెంబ్లీ నిర్వహిస్తామని హెచ్చరించారు.

### విద్యారంగానికి నిధులు పెంచాలి

విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామన్న హామీని ప్రభుత్వం విస్మరించిందని ఉపాధ్యాయ సంఘాలు విమర్శించాయి. నాణ్యమైన విద్య పేరుతో పాఠశాలల సంఖ్యను తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే నిర్వహించడం వల్ల తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో సాయంత్రం వరకు తరగతులు కొనసాగుతుండగా, ప్రభుత్వ పాఠశాలల్లో సమయం పరిమితం చేయడం వల్ల పిల్లలను పంపేందుకు తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారని తెలిపారు.

### ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

ప్రాథమిక విద్యకు ఆటంకంగా ఉన్న జీవో 25ను సవరించాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. 50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. నూతన జిల్లాలకు డీఈవో పోస్టులు, రెవెన్యూ డివిజన్లకు డిప్యూటీ ఈవో పోస్టులు, అన్ని మండలాలకు ఎంఈవో పోస్టులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పీవో 2018 ప్రకారం సర్వీస్ నిబంధనలు రూపొందించి పర్యవేక్షణ అధికారుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15లోగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలని, టెట్‌లో సర్వీస్ వెయిటేజీ ఇవ్వాలని కోరారు. ప్రత్యేక టెట్‌ను సబ్జెక్టుల వారీగా నిర్వహించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు మెమో 57 ప్రకారం పాత పెన్షన్ అమలు చేయాలని, బీసీ, గిరిజన గురుకులాల టైమ్‌టేబుల్‌లో మార్పులు చేయాలని కోరారు. మోడల్, ఎయిడెడ్ పాఠశాలలను విద్యాశాఖలో విలీనం చేయాలని సూచించారు. జీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని, జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, జీవో 190ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐదు విడతల కరువు భత్యం (డీఏ), పీఆర్సీని వెంటనే ప్రకటించాలని కోరారు. పెండింగ్ బిల్లులను ప్రతి నెలా రూ.2 వేల కోట్ల చొప్పున విడుదల చేయాలని, హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు చావ రవి, ఏ. వెంకట్, టీపీటీఎఫ్ నుంచి సీహెచ్ అనిల్ కుమార్, ఎన్. తిరుపతి, డీటీఎఫ్ నుంచి ఎం. సోమయ్య, టీ. లింగారెడ్డి, బీటీఎఫ్ నుంచి కొమ్ము రమేష్, ఎస్సీ, ఎస్టీ టీఎఫ్ నుంచి మేడి చరణ్ దాస్, టీటీఏ నుంచి ఎస్. హరికిషన్, ఎంఎస్టీఎఫ్ నుంచి బీ. కొండయ్య, ఎస్సీ, ఎస్టీ యూఎస్ నాయకులు వై. విజయ్ కుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ బకాయిలపై ఉక్కుపాదం

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వ్యవస్థపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. సీఎంఆర్ విధానంలో పారదర్శకత పెంపు, పరిపాలనా సంస్కరణలు, బకాయిల వసూళ్ల పై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. గత 10–12 ఏళ్లలో సీఎంఆర్ వ్యవస్థలో చోటుచేసుకున్న పరి ణామాలపై సమగ్ర పరిశీలన చేపట్టాలని నిర్ణయిం చారు. ప్రభుత్వానికి సీఎంఆర్ బియ్యం లేదా బకాయి లు చెల్లించకుండా డిఫాల్ట్‌గా ఉన్న రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం. పెండింగ్‌లో ఉన్న బకాయిల వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఇప్పటివరకు విజిలెన్స్ విభాగం నిర్వహించిన తనిఖీలు, నమోదైన కేసులు, వాటి దర్యాప్తు పురోగతిపై సమావేశంలో సమీక్షిం చారు. ఈ సమీక్షకు పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్, న్యాయ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యా రు. రైతుల ప్రయోజనాల పరిరక్షణతో పాటు ప్రభుత్వ నిధుల రక్షణే ఈ సమావేశం ప్రధాన లక్ష్యమని అధికార వర్గాలు వెల్లడించాయి.



# ఫిలింనగర్‌లో ఆషాఢమాసం బోనాల పండుగ

**ప్రజానావ, హైదరాబాద్:** ఆషాఢమాసం బోనాల పండుగ సందర్భంగా ఫిలింనగర్‌లోని మారెమ్మ–ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన దుర్గాభవాని నగర్, గౌతమ్ నగర్, దీన్ దయాళ్ నగర్ బస్తీల ప్రజలందరికీ ఆషాఢ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రతి ఇంటిపై ఉండాలని, రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు వల్లెపు శంకర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గుంటి ఆనంద్ సాగర్, యువ మోర్చా అధ్యక్షుడు మంజల నరసింహ, సోషల్ మీడియా కన్వీనర్ వరికుప్పల మహేష్, మహిళా మోర్చా నాయకురాలు దండుగుల మారెమ్మ, బీజేపీ సీనియర్ నాయకులు ముద్దంగుల రాజు, వల్లెపు హనుమంతు, ముద్దంగుల భీమయ్య, పెద్ద రాజు, మక్కలి రాంబాబు, వల్లెపు బాబు, వల్లెపు భీమేష్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఈ20 పెట్రోల్‌పై ఆప్ నిరసన

### ప్రధాని నివాసానికి ర్యాలీగా వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు

**న్యూఢిల్లీ:** ఈ20 పెట్రోల్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సేకరించిన 2.30 లక్షలకు పైగా సంతకాలతో ప్రధాని నివాసానికి వినతిపత్రం అందజేయడానికి బయలుదేరిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ఆ పార్టీ నేతలను ఢిల్లీ పోలీసులు మంగళవారం అడ్డుకున్నారు. దీంతో కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, జాస్మిన్ షా తదితరులు ఫిరోజ్ షా రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ20 ఇంధనం వల్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని ఆరోపించిన కేజ్రీవాల్, పెట్రోల్ బంకుల్లో స్వచ్ఛమైన పెట్రోల్, ఈ20 రెండింటినీ విక్రయించే అవకాశం కల్పించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ20ను ప్రోత్సహిస్తే దానిని తక్కువ ధరకు విక్రయించాలని కూడా సూచించారు. అయితే భద్రతా కారణాల దృష్ట్యా ఫిరోజ్ షా రోడ్డుకు మించి ఎవరినీ అనుమతించబోమని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు.

# ఈ20ని అడ్డుకుంటాం

- ప్రజా ఉద్యమంతోనే కేంద్రంపై ఒత్తిడి తెస్తాం
- ఆప్ జాతీయ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్
- ఈ విధానంతో విదేశీ ప్రయోజనాలకే లాభమని ఆరోపణ
- ఎంపీ సంజయ్ సింగ్ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ:** ఈ20 ఇంధన విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు కానివ్వబోమని, దీనికి వ్యతిరేకంగా చేపట్టిన ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఈ20 విధానాన్ని నిలువరించాలంటే ప్రజలు పెద్దఎత్తున ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ20 విధానానికి వ్యతిరేకంగా సేకరించిన 2.30 లక్షలకుపైగా వినతిపత్రాలను ప్రధానమంత్రి నివాసానికి అందజేయడానికి చేపట్టిన ర్యాలీ అనంతరం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. గోవా, గుజరాత్ రాష్ట్రాల్లో తమ పార్టీకి ఉన్న ఎమ్మెల్యేలు ఈ20 విధానాన్ని అసెంబ్లీల్లో తీవ్రంగా వ్యతిరేకిస్తారని తెలిపారు. ర్యాలీలో పాల్గొన్న వారి సంఖ్య కంటే ఉద్యమ స్ఫూర్తే ముఖ్యమని పేర్కొన్న ఆయన, సామాజిక మాధ్యమాల్లో విమర్శలు, ట్రోలింగ్‌ను ఎదుర్కొంటూ ఉద్యమంలో పాల్గొన్న కార్యకర్తల ధైర్యాన్ని అభినందించారు. కాగా, ప్రధానమంత్రి నివాసం వైపు ర్యాలీని ఢిల్లీ పోలీసులు అడ్డుకోవడంతో పార్టీ నేతలు ఫిరోజ్ షా రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ మాట్లాడుతూ, ఈ20 అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించామని, కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేయడంపై దృఢసంకల్పంతో ఉన్నట్లు ప్రభుత్వ సమాధానంతో స్పష్టమైందన్నారు. ఈ20 విధానం వల్ల భారత రైతులకు కాకుండా అమెరికా రైతులకే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని ఆరోపించారు. అమెరికా నుంచి ఇథనాల్ దిగుమతుల కోసం వస్తున్న ఒత్తిడికి కేంద్ర ప్రభుత్వం లొంగవద్దని, విదేశీ ప్రయోజనాల కంటే భారత రైతుల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీని కేజ్రీవాల్ కోరినట్లు తెలిపారు.

# నీటి ప్రవాహమే సమాధానం

- కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాధాన్యతను చాటుతోంది
- కాంగ్రెస్ దుష్ప్రచారాలు చేసినా రైతులకు వాస్తవాలు తెలుసు
- ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ప్రజానావ, హైదరాబాద్: ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా గోదావరి జలాలు ఎదురెక్కుతున్న తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు, దుష్ప్రచారాలకు నీటి ప్రవాహమే సమాధానమని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తన ప్రాధాన్యతను మరోసారి నిరూపించుకుంటోందని తెలిపారు. ఈ మేరకు కేటీఆర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎస్సారెస్పీకి కాళేశ్వరం జలాలు ఎదురెక్కుతున్న దృశ్యాలకు సంబంధించిన వీడియోను ఆయన పంచుకున్నారు. రివర్స్ పంపింగ్ విధానంతో శ్రీరాంసాగర్ వరద కాలువకు పునరుజ్జీవం కల్పిస్తూ, రాంపూర్, రాజేశ్వరరావుపేట పంప్‌హౌస్‌ల నుంచి నీటిని ఎత్తిపోస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా సుమారు రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోందని, తెలంగాణ రైతులకు కాళేశ్వరం ప్రాజెక్టు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్ని ఆరోపణలు, తప్పుడు ప్రచారాలు చేసినా తమ పొలాల్లో ప్రవహిస్తున్న నీటిని చూస్తున్న రైతులకు వాస్తవాలు తెలుసని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాముఖ్యతను నీటి ప్రవాహం స్పష్టం చేస్తోందని అన్నారు. ప్రాజెక్టుపై చేస్తున్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు.

# కేసు పెట్టిన అధికారిపై చర్యలా?

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదు చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకున్న పోలీసు అధికారిపై తెలంగాణ ప్రభుత్వం బదిలీ వేటు వేసిందని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన కిషన్‌రెడ్డి.. ప్రధానిపై అభ్యంతరకర పోస్టుల కేసులో చర్యలు తీసుకున్న డీసీపీ ఆనంద్‌బాబును రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసిందని తెలిపారు. రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వహించిన అధికారిని సీఎం రేవంత్‌రెడ్డి శిక్షించారని విమర్శించారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకే డీసీపీ బదిలీ జరిగిందని ఆరోపించారు. చట్టానికి అనుగుణంగా పనిచేసే అధికారులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని కిషన్‌రెడ్డి విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ ద్వారా అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆరోపిస్తూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తోందని విమర్శలు చేశారు. సోషల్ మీడియా సంస్థలు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను ఇష్టానుసారంగా ప్రభావితం చేస్తున్నాయని కిషన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే కారణంతో ప్రతిపక్ష నేతలపై కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో మాత్రం కేసులు నమోదు చేసిన అధికారులపైనే చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు. రేపు రాహుల్ గాంధీపై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఇలాగే వదిలేస్తారా అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు.

### సింగరేణిని కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు దోచుకున్నాయి

సింగరేణి కాలరీస్ సంస్థకు మూడు బొగ్గు బ్లాక్‌లను కేటాయించినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. మణుగూరు బ్లాక్‌ను కూడా సింగరేణికి అప్పగించినట్లు వెల్లడించారు. బొగ్గు బ్లాక్‌ల వేలంలో పాల్గొనేందుకు పలు సంస్థలు ముందుకొచ్చినప్పటికీ, సింగరేణి సంస్థ ప్రయోజనాలు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. నైనీ, తాడిచర్ల బ్లాక్–2, మణుగూరు బ్లాక్‌ల కేటాయింపు సింగరేణికి శుభపరిణామమని పేర్కొన్నారు. కొత్త బొగ్గు బ్లాక్‌లతో సింగరేణికి భవిష్యత్‌లో మరిన్ని అవకాశాలు లభిస్తాయని, గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు సింగరేణిని దోచుకున్నాయని ఆరోపించారు.

# వర్షాలు పడకుండా హరీశ్ క్షుద్రపూజలు

- అరుంధతి సినిమా తరహా పూజలు నిర్వహించారంటూ ఆరోపణలు
- మా వద్ద ఆధారాలు ఉన్నాయి: పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్
- మార్చి 2, జూన్ 1న ఎక్కడ ఉన్నారో చెప్పాలని డిమాండ్

**ప్రజానావ, హైదరాబాద్:** బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో వర్షాలు పడకూడదని, కరువు పరిస్థితులు నెలకొనాలని కోరుకుంటూ హరీశ్‌రావు క్షుద్ర పూజలు నిర్వహించారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. హరీశ్‌రావు 'అరుంధతి' సినిమా తరహాలో పూజలు నిర్వహించారని మహేశ్ గౌడ్ ఆరోపించారు. ఈ ఏడాది మార్చి 2న తమిళనాడులోని తిరుచ్చి, జూన్ 1న కర్ణాటకలోని శివమొగ్గకు హరీశ్‌రావు వెళ్లారని పేర్కొంటూ, ఆయా తేదీల్లో ఆయన ఎక్కడ ఉన్నారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. తిరుపతి పర్యటన సందర్భంగా మీడియాతో మాట్లాడిన హరీశ్‌రావు.. అఘోర ఆలయానికి వెళ్లిన విషయాన్ని ఎందుకు వెల్లడించలేదని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం కోసం దేవుడిని ప్రార్థించడం సహజమేనని, అయితే ప్రజలకు నష్టం కలగాలని కోరుతూ ఎలాంటి పూజలు చేయడం సరికాదని విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసమే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ అంశంపై వాస్తవాలను బయటపెట్టినందుకు అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్‌లకు లీగల్ నోటీసులు పంపించారని, అయితే ఆ నోటీసులకు తాము భయపడబోమని స్పష్టం చేశారు.

### ఏం చేశారో ప్రజలకు వివరించాలి

గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అఘోరాలతో కలిసి క్షుద్ర పూజలు చేశారంటూ ప్రచారం జరిగిందని మహేశ్ గౌడ్ గుర్తు చేశారు. ప్రస్తుతం హరీశ్‌రావుపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో అప్పట్లో జరిగిన ప్రచారాలపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వ్యాఖ్యానించారు. యాదగిరిగుట్టకు వెళ్లి పొర్లు దండాలు పెట్టిన హరీశ్‌రావు.. అక్కడ ఏం చేశారో ప్రజలకు వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో మంత్రాలు, తంత్రాల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ఘటనలు ఉన్నాయని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.



# బోనమెత్తిన లోక్ భవన్

- అమ్మవారికి పట్టు వస్త్రాలు, బోనం సమర్పించిన గవర్నర్ దంపతులు
- రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, సుభిక్షం కోసం ప్రత్యేక పూజలు

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను లోక్ భవన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లా అమ్మవారికి బోనం సమర్పించి, పట్టు వస్త్రాలు సమర్పిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుభిక్షం, శాంతి, సౌభాగ్యాలు కలగాలని గవర్నర్ దంపతులు ప్రార్థించారు. వేడుకల్లో లోక్ భవన్ అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా బోనాల ఉత్సవాలను నిర్వహించారు. కళాకారులు ఆలపించిన అమ్మవారి జానపద భక్తిగీతాలు భక్తి పారవశ్యాన్ని నింపగా, పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డప్పు వాయిద్యాల నడుమ ప్రదర్శించిన సంప్రదాయ కళారూపాలు ఆహూతులను ఆకట్టుకుని బోనాల వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చాయి.

# మసాలా పేరుతో విషం

- హైదరాబాద్‌లో కల్తీ మాఫియా బట్టబయలు
- 25.3 టన్నుల కల్తీ మసాలాలు, 89.15 టన్నుల ముడి పదార్థాల స్వాధీనం
- బట్టలకు వేసే రంగులు, ఇండస్ట్రియల్ డైలు, టాల్కమ్ పౌడర్‌తో తయారీ
- ముగ్గురు అరెస్టు
- క్యాన్సర్, కాలేయం, కిడ్నీ వ్యాధులకు కారణమయ్యే రసాయనాల వినియోగం
- హెచ్–ఫాస్ట్ దాడుల్లో విస్తుపోయే నిజాలు




**ప్రజానావ, హైదరాబాద్:** ప్రతి ఇంటి వంటింట్లో రోజూ ఉపయోగించే జీలకర్ర, వాము, ఆవాలు, లవంగాలు, షాజీరా వంటి మసాలా దినుసులు కల్తీ మాఫియా చేతిలో ప్రాణాంతక పదార్థాలుగా మారుతున్నాయి. లాభాల కోసం కొందరు వ్యాపారులు ఆహార పదార్థాల్లో బట్టలకు వేసే రంగులు, ఇండస్ట్రియల్ డైలు, టాల్కమ్ పౌడర్, రైస్ బ్రాన్ ఆయిల్, సింథటిక్ రంగులు, ఫ్యాబ్రిక్ డైలు, కొన్ని చోట్ల హెయిర్ కలర్ వంటి ప్రమాదకర రసాయనాలు కలిపి మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు హైదరాబాద్‌లో వెలుగుచూసిన భారీ కల్తీ మసాలాల వ్యవహారంలో తేలింది. కమిషనర్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలోని హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్–ఫాస్ట్), జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగం సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో 13 మసాలా ప్రాసెసింగ్, వ్యాపార కేంద్రాలపై దాడులు నిర్వహించి 25.3 టన్నుల కల్తీ మసాలాలు, 89.15 టన్నుల ముడి పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ టీజీఐసీసీసీ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి కోట్ల రూపాయల అక్రమ వ్యాపారం సాగిస్తున్న ముఠాలు మసాలాలకు మెరుపు, రంగు, బరువు పెంచేందుకు అత్యంత ప్రమాదకర రసాయనాలను వినియోగిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ రసాయనాల వల్ల క్యాన్సర్, కాలేయం, కిడ్నీ వ్యాధులు, అలర్జీలు, జీర్ణ సంబంధ సమస్యలు, నరాల వ్యాధులు, పిల్లల్లో ఎదుగుదల లోపాలు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజల నుంచి వచ్చిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. కల్తీ మసాలాల నమూనాలను ప్రయోగశాల పరీక్షలకు పంపించామని, నివేదికల ఆధారంగా ఆహార భద్రత చట్టం కింద నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్–2006 నిబంధనల ఉల్లంఘనలు, అనుచిత లేబులింగ్, మోసపూరిత ప్రాసెసింగ్ విధానాలు వెలుగుచూశాయని తెలిపారు. మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న భారీ స్థాయిలో ముడి పదార్థాలను స్వాధీనం చేసుకోవడంతో పెద్ద ఎత్తున కల్తీ మసాలాల తయారీ జరుగుతున్నట్లు నిర్ధారణ అయిందన్నారు. హెచ్–ఫాస్ట్ ఏర్పాటు చేసిన 140 రోజుల్లోనే 659 దాడులు నిర్వహించి 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడంతో పాటు 246 టన్నులకుపైగా కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు సజ్జనార్ వెల్లడించారు. గతంలో కుళ్లిన మాంసం, సింథటిక్ పనీర్, కల్తీ నెయ్యి, అల్లం–వెల్లుల్లి పేస్ట్, రసాయనాలతో మగ్గబెట్టిన పండ్లు, కల్తీ ఊరగాయలు, టీ పొడి తర్వాత ఇప్పుడు మసాలాల్లోనూ భారీ ఎత్తున కల్తీ బయటపడడం ఆందోళన కలిగిస్తోందన్నారు. నకిలీ, కల్తీ ఆహార పదార్థాల కేసుల విచారణ కోసం త్వరలో ప్రత్యేక సిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలు అనుమానాస్పద ఆహార పదార్థాలు కనిపించిన వెంటనే పోలీసులకు లేదా హెచ్–ఫాస్ట్‌కు సమాచారం అందించాలని, హెచ్–ఫాస్ట్ హెల్ప్‌లైన్ 87126 61212కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కేసులో మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు కేసులు, బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదు కాగా, కాటేదాన్‌కు చెందిన రాహుల్ భాటి, బేగంబజార్‌కు చెందిన విశాల్ పన్వార్, దులీచంద్ కచ్చవాలను పోలీసులు అరెస్టు చేశారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**ప్రజానావ, సిరిసిల్ల :** రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ ఆర్ ఎం భూపతిరెడ్డి లు సూచించారు. సిరిసిల్ల ఆర్టీసీ డిపోలో మంగళవారం రోడ్డు భద్రత పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిటిఓ, శ్రీనివాస్ రావు, డిప్యూటీ ఆర్ ఎం లు భూపతి రెడ్డి, మల్లేశం, ఎంబీఐ వంశీధర్, సిరిసిల్ల ఏఎంవిఐ పృథ్వీరాజ్ వర్మ, సాగర్ (కరీంనగర్), నిఖిల్(పెద్దపల్లి), డీఎం సిరిసిల్ల ప్రకాశ రావు, డీఎం వేములవాడ శ్రీనివాస్ లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల డిపోతో పాటు మొత్తం 11 డిపోల డ్రైవర్లు, సిరిసిల్ల హైర్ బస్సుల యజమానులు, హైర్ బస్ డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ శ్రీనివాస్ రావు, డిప్యూటీ ఆర్ఎం భూపతి రెడ్డి లు స్లైడ్ల ద్వారా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రధాన కారణాలు, ప్రమాదాలు జరిగే విధానం, ప్రమాదాల వల్ల కలిగే నష్టాలు, వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రయాణికుల ప్రాణాల రక్షణే ప్రతి డ్రైవర్ ప్రధాన బాధ్యత అని, సురక్షిత డ్రైవింగ్ ద్వారా ప్రమాద రహిత ప్రయాణానికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

# సంకల్ప సభను విజయవంతం చేయాలి

- రేపు సరూర్‌నగర్‌లో సామాజిక న్యాయ తెలంగాణ సాధన సభ
- టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి సలేంద్ర కొమురయ్య యాదవ్




**ప్రజానావ, పెద్దపల్లి :** హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో రేపు ఆగస్టు 6న ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నిర్వహించనున్న సంకల్ప సభ – సామాజిక న్యాయ తెలంగాణ సాధన సభను విజయవంతం చేయాలని టీఆర్ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి సలేంద్ర కొమురయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో సామాజిక న్యాయ తెలంగాణ సాధన సభ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన సభ లక్ష్యాలు, మేనిఫెస్టో ముఖ్యాంశాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సామాజిక, రాజకీయ సాధికారతే సంకల్ప సభ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కల్వకుంట్ల కవిత నాయకత్వంలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా వెనుకబడిన వర్గాలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం దక్కలేదని, ఇకపై బీసీ సమాజం ఐక్యంగా ముందుకు వచ్చి రాజ్యాధికార సాధన కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీల ఐక్యతకు ఈ సభ వేదిక కానుందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ లక్ష్యాలతో రూపొందించిన పాంచజన్యం మేనిఫెస్టోను సభలో ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఇందులో పేద విద్యార్థులకు పూర్తిగా ఉచిత విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు రాని నిరుద్యోగులకు స్వయం ఉపాధి కోసం రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణ సదుపాయం, రైతులకు ప్రతి ప్రభుత్వ కార్యాలయం లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు, వెనుకబడిన వర్గాలకు ఉచిత వైద్య సేవలు వంటి అంశాలు ఉన్నాయని వివరించారు. పెద్దపల్లి నియోజకవర్గం నుంచి సుమారు 300 మంది కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు స్వచ్ఛందం గా సభకు హాజరవుతారని సలేంద్ర కొమురయ్య యాదవ్ తెలిపారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ సంకల్ప సభను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వా ములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు సిరవేణి స్వప్న, గడ్డం లక్ష్మి, టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బొంగోని శంకరయ్య, ఉత్సం శ్రీనివాస్, కల్వల తిరుపతి, సీహెచ్ హన్మండ్లు, గంధం శంకర్, కే. రవీందర్, బి మహేష్ గౌడ్, ఆనంద్, పల్లె శ్రీనివాస్, ఎన్ కిట్టు, ఈ స్వామి, జి సాగర్, బి కమలాకర్, పి సది, బి కనుకయ్య, ఉప్పు గట్టయ్య పటేల్, ఎన్ స్వామి, ఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# మహిళా అంటే మహిళలకు సమాన హక్కులు

**ప్రజానావ, పెద్దపల్లి :** మండలంలోని కొత్తపల్లి గ్రామ సర్పంచ్ పెర్క రిబ్కా సంతోష్ మాట్లాడుతూ మహిళా అంటే మహిళలకు సమాన హక్కులు, గౌరవం, విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగింది అన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగితే కుటుంబం బలపడుతుందన్నారు. కుటుంబం బలపడితే గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. అదే విధంగా బాలసభ యొక్క ముఖ్య ఉద్దేశ్యం పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచనలు, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించడం జరుగుతుందన్నారు. నేటి పిల్లలే రేపటి దేశ భవిష్యత్తు అన్నారు. ప్రతి చిన్నారి పాఠశాలకు వెళ్లాలి, ఆరోగ్యంగా ఉండాలి, మంచి సంస్కారాలతో ఎదగాలి అని సూచించారు. బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, పిల్లలపై హింస వంటి దురాచారాలను పూర్తిగా నిర్మూలించాలని అన్నారు. తల్లిదండ్రులు తమ కుమార్తెలకు కూడా కుమారులతో సమానంగా విద్యను అందించాలన్నారు. ప్రతి బాలిక తన కలలను సాకారం చేసుకునే అవకాశం కల్పించడం మనందరి బాధ్యత అని గుర్తు చేశారు. మన గ్రామపంచాయతీ తరపున మహిళల సంక్షేమం, పిల్లల విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత మరియు భద్రత కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నాను అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి అర్హత కుటుంబానికి చేరేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సురేందర్ రావు సి ఎ లు తిరుమల సుప్రియ సంధ్య స్వశక్తి సంఘ సభ్యులు పాల్గొన్నారు

# సిరిసిల్ల పవర్‌లూమ్ పరిశ్రమ ముఖచిత్రానికి చిరునామా

- పద్మశాలీల ఆత్మగౌరవ చిహ్నం... నేతన్న జోహార్.. నేతన్న శ్రమకు గుర్తింపు
- సిరిసిల్లలో జోట చౌరస్తాను చూడడానికి వచ్చిన చొప్పదండి నేతన్నలు



**ప్రజానావ, సిరిసిల్ల :** వస్త్ర ఉత్పత్తిలో ముఖ్య భాగమైన జోటా చౌరస్తాను ఏర్పాటు చేసి వస్త్ర ఉత్పత్తికి కండల మిషిని, సాంచే, రంగులు అద్దకం, వార్పింగ్ మిషన్ ఇంకా విడిభాగాలను ఒకే దగ్గర ప్రదర్శన రూపంలో ఉంచి భవిష్యత్ తరాలకు టెక్స్టైల్ రంగానికి ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేయడం అభినందనీయం. వస్త్ర పరిశ్రమ అభివృద్ధి కోసం అనేక ప్రణాళికలు తయారు చేయడం నేతన్నలపై ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధి, అంకిత భావం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. చేనేత వారసత్వ సంపద పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ పాలకవర్గం అభినందనీయులు. జోటా చౌరస్తా శ్రమ శక్తికి పతాకం. వస్త్ర పరిశ్రమలో కార్మికుల శ్రమ ద్వారా రాత్ పైల్, దిన్ పైల్ ద్వారా ఉత్పత్తి అవుతున్న వస్త్రంకు ఒక మంచి ప్రత్యేక గుర్తింపు. ఇందిరమ్మ చీరల ఆర్డర్ వస్త్ర పరిశ్రమ అభివృద్ధి కోసం అనేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రవేట్ ఆర్డర్లతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సూరత్ మార్కెట్ ప్రభావం తో సిరిసిల్ల పవర్ లూమ్ కు మంచి భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. ప్రపంచ మార్కెట్టు ఉన్న పాప్లిన్ రంగాన్ని స్వాగతించాలని వస్త్ర నిపుణులు కోరుతున్నారు. వేలాది మంది కార్మికులకు ఎంతో ఉపాధి కలిగిస్తున్న పవర్లూమ్ పరిశ్రమ దేశం లో సిరిసిల్లకు ప్రత్యేక స్థానం ఉంది.

**నేతన్నల ఐకాన్.. కష్టజీవుల జీవుల దిక్సూచి జోట**

ప్రభుత్వం పవర్ లూమ్ పరిశ్రమకు సంబంధించిన అందమైన జోటా స్టాచ్ ఏర్పాటు చేయడం పట్ల కరీంనగర్ జిల్లా పద్మశాలి సంఘం జిల్లా కార్యదర్శి యెన్నం మునేందర్, చొప్పదండి పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు అనుమండ్ల సత్యనారాయణ, సహాయ కార్యదర్శి అనుమండ్ల రాజశేఖర్, హనుమండ్ల మహేష్, భారత్ నిర్మాణం వాలంటరీ చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు వేముల మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు. కలెక్టరేట్ కూడలిలో జోటా చౌరస్తాను ఏర్పాటు చేసిన ప్రభుత్వంకు ఎమ్మెల్యేలు, మంత్రులకు ప్రజా ప్రతినిధులకు అధికారులకు మున్సిపల్ కౌన్సిలర్లకు జిల్లా కలెక్టర్ కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. జోట స్టాచ్ ఏర్పాటు వలన సిరిసిల్లకు వచ్చే ప్రయాణికులకు, చూపరులకు, పర్యాటకులకు ఈ పట్టణానికి వచ్చే కొత్తవారికి జోట చౌరస్తా చూడగానే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ గుర్తుకు వస్తుంది. చూపరులకు మర్చిపోలేని ఒక జ్ఞాపకం వారి మదిలో ఉండిపోతుంది. నేతన్న కీర్తి కిరీటంలో మరో కలికితురాయి. వస్త్ర పరిశ్రమ అభివృద్ధి కి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలని ఆకాంక్షిస్తూ... ప్రభుత్వం చేస్తున్న టెక్స్టైల్ రంగానికి వేముల మార్కండేయులు హర్షం వ్యక్తం చేశారు.

# గిరిజనులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- రిమ్స్‌లో వైద్య సేవలను సమీక్షించిన ఐటీడీఏ పీఓ మంద మకరందు
- టీజీసీసీ గోదాముల నిర్వహణపైనా తనిఖీ
- పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం



**ప్రజానావ, ఆదిలాబాద్:** గిరిజనులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందేలా అన్ని స్థాయిల్లో అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి మంద మకరందు సూచించారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిని సందర్శించిన ఆయన గిరిజనులకు అందుతున్న వైద్య సేవలను సమీక్షించారు. ఆసుపత్రిలోని వివిధ వార్డులను పరిశీలించి చికిత్స పొందుతున్న గిరిజన రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం గిరిజన రోగుల వివరాలు నమోదు చేస్తున్న వార్డుల రిజిస్టర్లను పరిశీలించి రోగుల నమోదు, చికిత్స వివరాలు, వైద్య సేవల పురోగతి, మందుల పంపిణీ తదితర వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని వైద్య అధికారులను ఆదేశించారు. ప్రతి గిరిజన రోగికి అవసరమైన వైద్య సేవలు ఎలాంటి ఆలస్యం లేకుండా అందించడంతో పాటు మానవీయ దృక్పథంతో సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యం, మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న సేవల నాణ్యత వంటి అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆదిలాబాద్ కేంద్రంలోని గిరిజన సహకార సంస్థ (టీజీసీసీ) గోదాములను సందర్శించి అక్కడ నిల్వ ఉన్న అటవీ ఉత్పత్తులు, ఇతర వస్తువుల నిల్వ విధానం, స్టాక్ రిజిస్టర్లు, భద్రతా చర్యలు, నిర్వహణ పద్ధతులను క్షుణ్ణంగా పరిశీలించారు. నిల్వల వివరాలను పారదర్శకంగా నిర్వహిస్తూ ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గిరిజన సంక్షేమానికి సంబంధించిన ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ఫలాలు ప్రతి గిరిజన కుటుంబానికి చేరేలా కృషి చేయాలని మంద మకరందు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, అదనపు జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ కుడిమేత మనోహర్, రిమ్స్ వైద్యులు, గిరిజన సహకార సంస్థ అధికారులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల వేళ అప్రమత్తంగా ఉండాలి

**ప్రజానావ, కామారెడ్డి:** వరదలో చిక్కుకున్న 45 మంది ప్రయాణికుల సురక్షిత రక్షణ.. విధుల్లో పోలీసు, అగ్నిమాపక సిబ్బందికి ఎస్పీ అభినందనలు భారీ వర్షాల నేపథ్యంలో కామారెడ్డి పట్టణంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులను జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కామారెడ్డి పెద్ద చెరువు వద్దకు వెళ్లి నీటి ప్రవాహం, నీటి మట్టాన్ని పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులతో పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. చెరువులు, వాగులు, కల్వర్టులు, వరద ప్రవాహ ప్రాంతాల వద్దకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లవద్దని, సెల్ఫీలు, వీడియోల కోసం ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని హెచ్చరించారు.

# ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్ధంతి సభను విజయవంతం చేయండి

- 6న హైదరాబాద్ రవీంద్ర భారతిలో గద్దర్ వర్ధంతి సభ
- కరపత్రం ఆవిష్కరించిన ప్రజా సంఘాల నాయకులు



**ప్రజానావ, పెద్దపల్లి :** ప్రజాకవి, విప్లవ గాయకుడు, ప్రజా యుద్ధ నౌక గద్దర్ మూడవ వర్ధంతి సందర్భంగా ఈనెల 6న సాయంత్రం 4 గంటలకు హైదరాబాదు రవీంద్ర భారతిభవన్లో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు దళిత లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడీ సుదర్శన్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య లు తెలిపారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రం బస్టాండ్ వద్ద పోస్టర్ ఆవిష్కరణ చేసారు. గద్దర్ ఆశయాలు, ఆయన ప్రజా ఉద్యమాలకు అందించిన సేవలు, సాహిత్య వారస త్వంపై ప్రముఖులు ప్రసంగించనున్నట్లు వెల్లడించా రు. ప్రజాసంఘాల నాయకులు, కళాకారులు, మేధావులు, గద్దర్ అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గద్దర్ చూపిన సమానత్వం, సామా జిక న్యాయం, ప్రజా చైతన్య మార్గాన్ని భావితరాలకు చేరవేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సభకు ప్రజలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడీ సుదర్శన్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య, తెలంగాణ ఉద్యమకారుల జాక్ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు, ప్రజా సంఘాల నాయకులు శ్రీపతి రాజగోపాల్, గూళ్ల రాజు, కె. రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

**ప్రజానావ, సిరిసిల్ల :** మంగళవారం జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఆదేశాల మేరకు ఆర్ఐ (అడ్మిన్) ఆధ్వర్యంలో నార్కోటిక్ జాగిలం సహాయంతో ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కిరాణా షాప్, పాన్ షాప్స్, బస్టాండ్, విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, క్రయ, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, బస్టాండ్‌లు వంటి ప్రజా రద్దీ ప్రాంతాలు, విద్యాసంస్థల పరిసరాల్లో నార్కోటిక్ జాగిలాల సహాయంతో తరచూ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని పేర్కొంటూ, వాటి దుష్పరిణామాలపై ప్రజలు, విద్యార్థులు, యువతలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ లేదా గంజాయి విక్రయం, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్ 8712671111కు లేదా సమీప పోలీస్ అధికారులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.



# బీజేపీ ఆత్మపరిశీలనకు ఇదే సమయం!

**ఉప ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాల్లో బీజేపీ కేవలం గుజరాత్‌లో ఒక్కసీటు మాత్రమే గెల్చుకోగలిగింది. బీహార్, మధ్యప్రదేశ్‌లలో అధికారంలో ఉన్నా, అక్కడ గెలవలేదు. సాధారణంగా అధికారంలో ఉన్నచోట ఉప ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులే గెలుస్తారు. కానీ అనూహ్యంగా బీజేపీ పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకత కనబర్చారు. మొన్నటికి మొన్న నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థులు గళమెత్తారు. విద్యార్థుల పార్లమెంటు ముట్టడి గర్జనకు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే చేయక తప్పని పరిస్థితి వచ్చింది.**

EDITORIAL

నేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మేల్కోవాల్సిన సమయం వచ్చింది. ఇక్కడ బీజేపీ అంటే మోడీ, అమిత్ షా మాత్రమే అని చెప్పుకోవాలి. ఎందుకంటే అధకారంలోనూ, పార్టీలోనూ ఈ ఇద్దరిదే పెత్తనం కనుక వీరిద్దరు మేల్కొంటే బీజేపీ మేల్కొన్నట్లుగానే చూడాలి. ఎందుకంటే బీజేపీ పాలనలో ప్రజల పట్ల మెల్లగా వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. వీటిని ఆ ఇద్దరు ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ఉప ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాల్లో బీజేపీ వలం గుజరాత్‌లో ఒక్కసీటు మాత్రమే గెల్చుకోలి గింది. బీహార్, మధ్యప్రదేశ్‌లలో అధికారంలో ఉన్నా, అక్కడ గెలవలేదు. సాధారణంగా అధికారంలో ఉన్నచోట ఉప ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులే గెలుస్తారు. కానీ అనూహ్యంగా బీజేపీ పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకత కనబర్చారు. మొన్నటికి మొన్న నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థులు గళమెత్తారు. విద్యార్థుల పార్లమెంటు ముట్టడి గర్జనకు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే చేయక తప్పని పరిస్థితి వచ్చింది. ఇది తమ ఎత్తుగడే అని బీజేపీ నేతలు సమర్థించుకున్నా అంతిమంగా విజయం విద్యార్థుల వైపే ఉంది. తాము ఎన్నుకున్న ప్రభుత్వాలే తమ భవిష్యత్తును నట్టేట ముంచుతుంటే ఓపిక, సహనం నశించి తీవ్రమైన ఆవేదన, ఆవేశం, ఆక్రోశంతో యువత రగిలి చేసిన పోరాటంగా దీనిని చూడాలి. ప్రారంభంలో విద్యార్థుల పోరాటాన్ని బేఖాతరు చేసిన ప్రధాన మీడియా చానెళ్లు కూడా తదనంతరం తప్పనిసరి పరిస్థితుల్లో మేల్కొన్నాయి. వారి పోరాటాన్ని గుర్తించక తప్పలేదు. ఈ పోరాటం వెనక ఎవరు ఉన్నారన్నది తెలుసుకుంటూనే, విద్యార్థుల్లో ముఖ్యంగా యువతలో నిద్రాణంగా ఉన్న ఆక్రోశాన్ని డా గుర్తించాలి. అందు బీజేపీ నేతలు విదేశీ హస్తం ఉంటే గుర్తించి చర్యలు తీసుకోవడం ఒక ఎత్తయితే..యువతలో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆందోళనలను డా గుర్తించాలి. విద్యార్థులు చేసిన ఏ ఉద్యమం డా విఫలమైనట్టు ప్రపంచ చరిత్రలో లేదు. అది వివిధ దేశాల స్వాతంత్ర్య ఉద్యమాల నుంచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో పాటు ఇప్పుడు కాక్రోచ్‌ల ఉద్యమం వరకు రుజువైంది. విద్యార్థులు, యువతతో పెట్టుకున్న ఏ ప్రభుత్వాలూ, పార్టీలూ మనుగడ సాగించలేవు. ఎంతటి బలమైన నియంతృత్వ ప్రభుత్వమైనా విద్యార్థుల పోరాటానికి తారుమారైన చరిత్ర ఉంది. విద్యార్థులే కదా అని అలుసుగా తీసుకుంటే అధికారం గల్లంతవుతుంది. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, ఇతర ఆఫ్రికా దేశాల్లో జరిగిన అనేక ప్రజా ఉద్యమాలను చూసిన తరవాత మనం డా జాగ్రత్త పడాలి. అలాంటి పరిస్థితి ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో భవిష్యత్తులో రాకుండా ఉండాలంటే సమస్యలను పక్షపాత ధోరణితో సాగదీయకుండా పాలకులు, ప్రభుత్వాలు పరిష్కరించాలి. అధికా రం శాశ్వతం అనుకుంటే... వారి రాజకీయ మనుగడకు ప్రమాదం వాటిల్లుతుంది. భవిష్యత్తులో ఇంతకంటే తీవ్ర స్థాయిలో విద్య, ఉద్యోగ, రాజకీయంగా అణచివేయబడ్డ అనేక సామాజిక వర్గాల నుంచి ప్రతిఘటనలు ఎదుర్కోవాల్సి వస్తుందని గుర్తించాలి. ఇకపోతే ఇదొక్కటే అనుకుంటే పొరపాటు. ఎన్నికల్లో డా ప్రజలు మెల్లగా మోడీ పాలనపై వ్యతిరేకత వ్యక్త పరుస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని 242 సీట్లకు పరిమితం చేశారు. ఇదే మొదటి హెచ్చరిక. ఇక ఇప్పుడు తాజా ఉప ఎన్నికల ఫలితాలు మరో హెచ్చరికగా చూడాలి. చాపకింద నీరులా ప్రజల్లో నివురుగప్పిన అసంతృప్తిని గుర్తించాలి. పాలనలో మూస పద్ధతి నుంచి బయటపడాలి. ధరల పెరుగుదల, నిరుద్యోగం, పన్నులు వంటివి ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఆస్పత్రులు, విద్యారంగం మరీ దిగజారి పోతున్నాయి. సమాజంలో ప్రతి ఒక్క రంగం జనాలను జలగల్లా పీల్చి పిప్పి చేస్తున్నాయి. వీటిని తక్షణం సవ్యక్షించుకోక పోతే ఇది పెను ఉప్పెనలా విరుచుకు పడడం ఖాయం. ఎందుకంటే ఉప ఎన్నికలు, విద్యార్థుల ఆందోళనలను బీజేపీ నేతలు సీరియస్గా తీసుకుని సవ్యక్షించుకోవాల్సిన అత్యవసర పరిస్థితి ఇది. బిహార్‌లోని బాంకీపూర్ శాసనసభ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో జన్ సురాజ్ పార్టీ అధినేత, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ విజయం రాష్ట్ర, దేశ రాజకీయాల్లో విస్తృత చర్చకు దారితీసింది. ఉప ఎన్నికలో ఆయన నీరజ్‌కుమార్ సిన్హా అనే బీజేపీ అభ్యర్థిపై విజయం సాధించి ఉండవచ్చు. కానీ, నిజానికి ఆయన ఓడించింది బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్‌నే అని గుర్తించాలి. ఒక్క నితిన్‌నే కాదు మోడీ, అమిత్ షాలను అని డా గుర్తించాలి. పదిహేనేళ్ళ క్రితం వర పాట్నా వెస్ట్‌గా ఉన్న ఈ అర్బన్ అసెంబ్లీ స్థానాన్ని వరుసగా ఐదుసార్లు ఘనంగా నెగ్గుకొచ్చిన నితిన్ నబీన్ రాజ్యసభకు తరలడంతో ఈ ఉపఎన్నిక అనివార్యం అయ్యింది. దీనికితోడు, బీజేపీ అధ్యక్షుడి కంటే ముందు ఆయన తండ్రి కిశోర్ ప్రసాద్‌సిన్హా సైతం ఏకబిగిన పలుమార్లు గెలుచుకున్నస్థానం కావడంతో ఈ శాసనసభ ఉపఎన్నిక ఫలితం యావత్ దేశాన్ని ఆకర్షించింది. బిహార్‌లో సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని తొలి బీజేపీ ప్రభుత్వానికి ఎదురైన తొలి ఎన్నికల పరీక్ష ఇది. కాయస్థ, భూమిహార్, రాజ్‌పుట్ ఇత్యాది అగ్రకులాల సంఖ్యాబలం గణనీయంగా ఉన్న ఈ స్థానం చేజారిపోవడం కచ్చితంగా ఆ పార్టీ పెద్దలకు ఆందోళన కలిగించే అంశం. గత ఏడాది ఎన్నికల్లో ఆర్జేడీ అభ్యర్థిపై నితిన్ నబీన్ యాభైవేల మెజారిటీతో గెలిచారన్నది దృష్టిలో ఉంచుకుంటే ఇప్పటి పరాజయం తీవ్రత అర్థమవుతుంది. నీట్ పరీక్షలో అవకతవకలు, పిల్లల ఆత్మ హత్యలు, ఉధృతంగా సాగిన జెన్‌జీ ఉద్యమం, ఉద్యోగ ఉపాధి అవకాశాల లేమి వంటివి ఈ ఫలితాలను ప్రభావితం చేశాయని చెప్పకతప్పదు. ఇవ న్నీ కూడా పరిష్కరించగలిగినవే. రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులతో ప్రజలకు పాలనను చేరువ చేయగలిగే సమర్థతను ప్రదర్శించగలిగిన్పుడే బీజేపీ మనుగడ కొనసాగుతుంది.

**గత ఏడాది ఎన్నికల్లో ఆర్జేడీ అభ్యర్థిపై నితిన్ నబీన్ యాభైవేల మెజారిటీతో గెలిచారన్నది దృష్టిలో ఉంచుకుంటే ఇప్పటి పరాజయం తీవ్రత అర్థమవుతుంది. నీట్ పరీక్షలో అవకతవకలు, పిల్లల ఆత్మ హత్యలు, ఉధృతంగా సాగిన జెన్‌జీ ఉద్యమం, ఉద్యోగ ఉపాధి అవకాశాల లేమి వంటివి ఈ ఫలితాలను ప్రభావితం చేశాయని చెప్పకతప్పదు. ఇవ న్నీ కూడా పరిష్కరించగలిగినవే. రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులతో ప్రజలకు పాలనను చేరువ చేయగలిగే సమర్థతను ప్రదర్శించగలిగిన్పుడే బీజేపీ మనుగడ కొనసాగుతుంది.**



## ఆటో బోల్తా.. 11 మంది కూలీలకు గాయాలు

- రత్నవరం సమీపంలో ప్రమాదం.. కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు
- క్షతగాత్రులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

**ప్రజానావ, కోదాడ:** నడిగూడెం మండల పరిధిలోని రత్నవరం గ్రామ సమీపంలో మంగళవారం ఆటో బోల్తాపడిన ఘటనలో 11 మంది నాటు కూలీలు గాయపడ్డారు. రామాపురం గ్రామానికి చెందిన కూలీలు ఆటోలో రత్నవరం గ్రామానికి కూలి పనులకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో గాయపడిన వారిని వెంటనే కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై స్థానిక ఎస్ఐ తేజస్విని మాట్లాడుతూ ప్రమాదానికి సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీలను కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు. గాయపడిన కూలీలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# నకిలీ ఎరువుల ముఠాలపై ఉక్కుపాదం

- 872 నకిలీ డీఏపీ సంచులు స్వాధీనం
- మూడు ఎఫ్ఐఆర్‌లు, ఏడుగురు అరెస్టు
- లైసెన్స్ పొందిన డీలర్ల నుంచే ఎరువులు కొనుగోలు చేయాలని రైతులకు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచన



**ప్రజానావ, నాగర్‌కర్నూల్:** జిల్లాలో రైతుల ప్రయోజనాల పరిరక్షణతో పాటు నాణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జిల్లా యంత్రాంగం అత్యున్నత ప్రాధాన్యమని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. రైతులను మోసం చేస్తూ నకిలీ ఎరువుల తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలకు పాల్పడే వ్యక్తులు, ముఠాలపై ఎలాంటి రాజీ లేకుండా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో నకిలీ డై–అమోనియం ఫాస్ఫేట్ (డీఏపీ) ఎరువులు విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా పరిపాలన, వ్యవసాయ, పోలీసు శాఖలు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. బిజినేపల్లి, తిమ్మాజీపేట, తాడూరు, కల్వకుర్తి మండలాల్లో చేపట్టిన ఆకస్మిక దాడుల్లో ప్రముఖ ఎరువుల కంపెనీల పేర్లతో నకిలీ లేబుళ్లు అతికించిన 872 డీఏపీ ఎరువుల సంచులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించి బిజినేపల్లి, తాడూరు, కల్వకుర్తి పోలీస్ స్టేషన్లలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ట్రేడ్‌మార్క్స్ చట్టం, ఎరువుల (నియంత్రణ) ఉత్తర్వులు–1985 నిబంధనల కింద మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు. నకిలీ ఎరువుల అక్రమ రవాణా, నిల్వ, సరఫరాలో మొత్తం తొమ్మిది మంది ప్రమేయం ఉన్నట్లు గుర్తించామని, వారిలో ఏడుగురిని అరెస్టు చేయగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. వారిని పట్టుకునేందుకు పోలీసు శాఖ ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఎరువుల నమూనాలను రాష్ట్ర ఎఫ్‌సీఏ నాణ్యత నియంత్రణ ప్రయోగశాలకు పంపగా, రసాయన విశ్లేషణలో నత్రజని, భాస్వరం వంటి కీలక పోషకాలు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేలిందన్నారు. దీంతో వాటిని అధికారికంగా నాన్–స్టాండర్డ్, నకిలీ ఎరువులుగా ప్రకటించినట్లు వెల్లడించారు. నిందితు లపై నిత్యావసర వస్తువుల చట్టం–1955లోని సెక్షన్ 3, 7తో పాటు ఇతర వర్తించే చట్టాల ప్రకారం కఠిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే నిత్యావసర వస్తువుల చట్టంలోని సెక్షన్ 6(ఏ) ప్రకారం స్వాధీనం చేసుకున్న ఆస్తులను జప్తు చేసే రెవెన్యూ ప్రక్రియను ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేసిన కలెక్టర్, ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను తప్పనిసరిగా లైసెన్స్ పొందిన డీలర్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), రైతు సేవా కేంద్రాలు వంటి అధికారిక విక్రయ కేంద్రాల నుంచే కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలుకు అధికారిక బిల్లు లేదా రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని, బిల్లు లేని వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయవద్దని హెచ్చరించారు. గుర్తింపు లేని వ్యక్తులు, నమోదు కాని వ్యాపారులు లేదా అనధికార వాహనాల ద్వారా విక్రయించే ఎరువులను కొనుగోలు చేయరాదన్నారు. నకిలీ ఎరువుల విక్రయాలు, అనుమానాస్పద నిల్వలు లేదా అక్రమ వ్యాపారంపై సమాచారం తెలిసినా వెంటనే స్థానిక మండల వ్యవసాయ అధికారికి లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. జిల్లాలో నకిలీ ఎరువుల అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, రైతులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

# తల్లి - బిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి
- పోషకాహారం, ఆరోగ్య సేవలు, ఎస్ఐఆర్ దరఖాస్తులపై అధికారులకు కీలక ఆదేశాలు

**ప్రజానావ, యాదాద్రి భువనగిరి:** అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని అంగడి బజార్ అంగన్వాడీ కేంద్రం–3, రాయగిరి అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన ఆయన అక్కడ అందుతున్న సేవలను పరిశీలించారు. కేంద్రాల్లో నమోదైన చిన్నారులు, గర్భిణులు, బాలింతల హాజరు, పోషకాహారం పంపిణీ, హాజరు నమోదు విధానం, చిన్నారులకు బోధన, ఆటల ద్వారా బోధిస్తున్న విధానంపై ఆరా తీశారు. చిన్నారుల తల్లిదండ్రులతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. చిన్నారులకు రంగులు, బొమ్మలు చూపించి వారి అభ్యాస స్థాయిని స్వయంగా పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పాలు, గుడ్లు, పప్పులు



తదితర పోషకాహారం సక్రమంగా అందుతున్నదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులతో మాట్లాడి రక్తహీనత పరీక్షలు, స్కానింగ్‌లు తప్పనిసరిగా చేయించుకోవాలని, పోషకాహారం తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ ఉపాధ్యాయులతో సమావేశమై బీఎల్‌వోలుగా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)కు సంబంధించిన దరఖాస్తులను అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి సేకరించి, పూర్తిగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లు లేకుండా సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో నవీన్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**పోచారం అభయారణ్యం, డ్యామ్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్ నగేష్**

**ప్రజానావ, సంగారెడ్డి:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. మంగళవారం హవేలీఘనాపూర్ మండలంలోని పోచారం అభయారణ్యాన్ని సందర్శించిన ఆయన అనంతరం పోచారం డ్యామ్‌లో వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతిని సంరక్షించడం ద్వారా మాత్రమే మానవ జీవితానికి సార్థకత చేకూరుతుందని పేర్కొన్నారు. జీవ వైవిధ్యమే మానవ మనుగడకు జీవనాధారమని, ప్రకృతి సంపదను భావితరాల కోసం పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. అనంతరం పోచారం డ్యామ్‌లోకి వస్తున్న వరద ప్రవాహాన్ని పరిశీలించి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ సింధు రేణుక, ఆర్ఐ సిద్ధు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు చోరీ.. ఇద్దరు అరెస్ట్

**నిందితుల నుంచి బంగారం స్వాధీనం, కోర్టులో హాజరు**

**ప్రజానావ, ఖమ్మం:** ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండలం శ్రీరాంపురం తండాలో వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడు చోరీ చేసిన ఇద్దరు నిందితులను ఏన్కూర్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి చోరీకి గురైన బంగారాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. అరెస్టయిన నిందితులు భూక్య హర్షవర్ధన్, బానోత్ కిషోర్‌గా గుర్తించారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్న వీరిద్దరూ అప్పుల ఒత్తిడితో ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. గత నెల 31వ తేదీ అర్ధరాత్రి సమయంలో వీధి లైటును ఆపివేసి ఇంట్లోకి ప్రవేశించిన నిందితులు, నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడును బ్లేడ్‌తో కోసి పరారయ్యారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి తూతిక్కలింగన్నపేట బ్రిడ్జి వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వేగంగా దర్యాప్తు పూర్తి చేసి కేసును ఛేదించిన ఏన్కూర్ ఎస్ఐ ఎన్. సంధ్యతో పాటు పోలీసు సిబ్బందిని ఏసీపీ వసుంధర యాదవ్ ప్రత్యేకంగా అభినందించారు.

# రెవెన్యూ శాఖపై ప్రజల విశ్వాసం పెరిగేలా పనిచేయాలి

- భూసేకరణ, భూభారతి దరఖాస్తులు, ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ కే. హైమావతి ఆదేశం
- పారదర్శక సేవలతో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని సూచన

**ప్రజానావ, సిద్దిపేట:** రెవెన్యూ శాఖపై ప్రజల్లో గౌరవం, విశ్వాసం మరింత పెరిగేలా పారదర్శకంగా సేవలందించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్‌తో కలిసి ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు ఏ సేవ అవసరమైనా ముందుగా రెవెన్యూ శాఖనే ఆశ్రయిస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టే విధంగా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో రెవెన్యూ అధికారులు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. జిల్లాలో టీజీఐఐసీ గుర్తించిన భూముల సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డీవోలను ఆదేశించారు. దేవాదుల, గౌరవెల్లి ప్రాజెక్టులతో పాటు జాతీయ రహదారి, రీజనల్ రింగ్ రోడ్‌కు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొంటూ, రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులు, సాదా బైనామాలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. భూభారతి చట్టంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సీఎం ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని, ముఖ్యంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ భూములపై సర్వే నిర్వహించి ఆక్రమణలను అరికట్టాలని ఆదేశించారు. రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ వివరాలను సేకరించి పూర్తయిన ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయాలకు ప్రభుత్వ భూములు గుర్తించి కొత్త భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మీ సేవ, తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఆదాయ, కుల, నివాస, మరణ ధ్రువపత్రాల దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్వో నాగరాజమ్మ, ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, ఎస్‌డీసీ వరలక్ష్మి తదితర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# భద్రాచలం ఆలయ పునర్నిర్మాణ పనులు గడువులోగా పూర్తి చేయాలి

- ఆలయ ప్రాచీనతకు భంగం కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ అంకిత్ ఆదేశం
- గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు మెరుగైన దర్శన, మౌలిక వసతుల కల్పనే లక్ష్యమని వెల్లడి

**ప్రజానావ, భద్రాచలం:** దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో చేపడుతున్న పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ముందుగా ఉత్తర ద్వార దర్శనం వద్ద కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి, డ్రాయింగ్‌లను పరిశీలిస్తూ పనుల నాణ్యత, రూపకల్పన, పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉత్తర ద్వార దర్శనం నిర్మాణాన్ని ముక్కోటి ఏకాదశి నాటికి తప్పనిసరిగా పూర్తి చేయాలని, అవసరమైతే అదనపు సిబ్బంది, యంత్రాలను వినియోగించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం తూర్పు వైపు నుంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణ మార్గంలో పర్యటిస్తూ తూర్పు, దక్షిణ, పడమర దిశల్లో కొనసాగుతున్న పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రతి నిర్మాణానికి సంబంధించిన నమూనాలను పరిశీలిస్తూ అధికారులు, ఇంజినీర్లతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఆలయ ప్రాచీనత, ఆధ్యాత్మిక విశిష్టతకు ఎలాంటి భంగం కలగకుండా నిర్మాణాలు చేపట్టాలని, నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న కలెక్టర్‌కు అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. వేద పండితులు వేదాశీర్వచనం అందించగా, కలెక్టర్ శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ఆలయ పునర్నిర్మాణ, అభివృద్ధి పనులకు ఈ ఏడాది మార్చిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు పనుల పురోగతిని సమీక్షించేందుకు ఈ పర్యటన చేపట్టినట్లు తెలిపారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు రోడ్లు & భవనాల శాఖ నుంచి ప్రత్యేక అధికారిని నియమిస్తున్నట్లు వెల్లడించారు. గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు మెరుగైన దర్శన సౌకర్యాలు, విశాలమైన రాకపోకల మార్గాలు, ఆధునిక మౌలిక వసతులు కల్పించేలా అన్ని ప్రధాన పనులను పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో భద్రాచలం తహసీల్దార్ రవికుమార్, పంచాయతీ ఈవో, ఆర్అండ్‌బీ శాఖ ఈఈ నాగేశ్వరరావు, దేవాదాయ శాఖ అధికారులు, రోడ్లు & భవనాల శాఖ ఇంజినీర్లు, సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజానావ, మహబూబ్‌నగర్:** గ్రామీణాభివృద్ధిలో ఉప సర్పంచ్‌ల పాత్ర ఎంతో కీలకమని, వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తుందని రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తెలిపారు. రాష్ట్ర ఉప సర్పంచ్‌ల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల కార్తీక్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మ్యాతరి గోపాల్ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్‌ల బృందం మంగళవారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల అభివృద్ధి, ఉప సర్పంచ్‌లకు తగిన అధికారాల కల్పన, పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం, స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని మ్యాతరి గోపాల్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఉప సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి శ్రద్ధగా ఆలకించి, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి సానుకూల స్పందనపై జిల్లా అధ్యక్షుడు మ్యాతరి గోపాల్ కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఉప సర్పంచ్‌ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి నిరంతరం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీకేఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు, కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ బాలకృష్ణారెడ్డి, నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెన్నయ్య సాగర్, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, ఉప సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# సింగరేణి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో వృత్తి నైపుణ్య శిక్షణ

- **నైపుణ్యాలను పెంపొందించుకుని ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి**
- **కంప్యూటర్ గ్రాఫిక్ డిజైన్ కోర్సులను ప్రారంభించిన ఏరియా–1 జీఎం డీ. లలిత్‌కుమార్**

**ప్రజానావ, రామగుండం:** రామగుండం ఏరియా–1 పరిధిలోని గోదావరిఖని తిలక్‌నగర్‌లో ఉన్న సింగరేణి స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో కంప్యూటర్ గ్రాఫిక్ డిజైన్ వృత్తి నైపుణ్య శిక్షణ కోర్సులను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రామగుండం ఏరియా–1 జనరల్ మేనేజర్ డి. లలిత్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడం అత్యంత అవసరమని అన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ (ఎంఎస్‌ఎంఈ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇటువంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధితో పాటు వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమాలు యువతలో నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో మెరుగైన ఉపాధి అవకాశాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జీఎంకు ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, జీవీటీసీ మేనేజర్ మాధవరెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రావణ్‌కుమార్, ఎంఎస్‌ఎంఈ జాయింట్ డైరెక్టర్ దశరద్, ఆర్గనైజర్ ఖాన్, శిక్షణా కేంద్రం అధ్యాపకులు, సిబ్బంది, శిక్షణ పొందుతున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

# సింగరేణికి మణుగూరు కోల్ బ్లాక్ కేటాయింపు చారిత్రాత్మక విజయం

- **కార్మికుల ఉపాధి భద్రతకు కీలక ముందడుగు: వడ్డేపల్లి కుమారస్వామి**
- **ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి బీఎంఎస్ కృతజ్ఞతలు**



**ప్రజానావ, రామగుండం:** సింగరేణి సంస్థకు మణుగూరు పీకే ఓసీ–2 డిప్‌సైడ్ కోల్ బ్లాక్‌ను వేలం ద్వారా కేటాయించడం తెలంగాణ పారిశ్రామికాభివృద్ధికి, సింగరేణి భవిష్యత్తుకు, వేలాది మంది కార్మికుల ఉపాధి భద్రతకు చారిత్రాత్మక విజయమని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమారస్వామి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు సింగరేణికే దక్కేలా భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) నిరంతరం పోరాటం సాగించిందన్నారు. జాతీయ బీఎంఎస్ కోల్ సెక్టార్ ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి కృషి ఫలితంగానే కార్మికుల ఆకాంక్షలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం తో పాటు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని ప్రత్యేకంగా కలిసి ఈ అంశంపై విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. సింగరేణికి మరో కోల్ బ్లాక్‌ను కేటాయించిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డికి తెలంగాణ ప్రజలు, సింగరేణి కార్మికుల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మణుగూరు పీకే ఓసీ–2 డిప్‌సైడ్ బ్లాక్‌లో సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఏటా 6 మిలియన్ టన్నుల ఉత్పత్తితో సుమారు 25 సంవత్సరాల పాటు గని కార్యకలాపాలు కొనసాగనున్నాయని వివరించారు. సింగరేణి ప్రయోజనాల పరిరక్షణలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని, భవిష్యత్తులో కూడా సంస్థ అభివృద్ధికి అవసరమైన చర్యలు కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

Singareni news

# బదిలీపై వెళ్తున్న సుజాయ్ మజిందర్‌కు ఘన సన్మానం

- **ఆర్‌జీ రీజియన్ సేవలను కొనియాడిన ఏరియా -1 జీఎం డి. లలిత్‌కుమార్**
- **కొత్త బాధ్యతల్లోనూ విజయాలు సాధించాలని ఆకాంక్ష**



**ప్రజానావ, రామగుండం:** సింగరేణి రామగుండం రీజియన్‌లో జనరల్ మేనేజర్ (క్వాలిటీ)గా విధులు నిర్వహిస్తూ కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలో జనరల్ మేనేజర్ (క్వాలిటీ)గా బదిలీపై వెళ్తున్న సుజాయ్ మజిందర్‌కు మంగళవారం సాయంత్రం ఘనంగా వీడ్కోలు సన్మానం నిర్వహించారు. రామగుండం ఏరియా–1 జనరల్ మేనేజర్ డి. లలిత్‌కుమార్ అధ్యక్షతన జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు పూల బొకే అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా లలిత్‌కుమార్ మాట్లాడుతూ రామగుండం రీజియన్‌లో సుజాయ్ మజిందర్ అందించిన సేవలను ప్రశంసించారు. విధి నిర్వహణలో ఆయన ప్రదర్శించిన నిబద్ధత, క్రమశిక్షణ, నాణ్యత ప్రమాణాల అమలులో చూపిన అంకితభావం ఆదర్శనీయమని పేర్కొన్నారు. కొత్త బాధ్యతల్లోనూ అదే స్థాయిలో ప్రతిభ కనబర్చి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సుజాయ్ మజిందర్ మాట్లాడుతూ రామగుండం రీజియన్‌లో తన విధుల నిర్వహణకు సహకరించిన జీఎం డి. లలిత్‌కుమార్‌తో పాటు అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వో టు జీఎం చంద్రశేఖర్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సాయిప్రసాద్, లక్ష్మీబాయి ఏజెంట్ ఎల్. రమేష్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీజీఎం (సివిల్) వరప్రసాద్, అధికారులు మోహన్‌రావు, వేణు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మేడారం జాతర వచ్చినా కాజీపేట ఆర్వోబీ పూర్తి కావట్లే

## బ్రిడ్జి నిర్మాణంలో జాప్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు

**ప్రజానావ, హనుమకొండ:** కాజీపేట ఫాతిమానగర్ వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్‌బ్రిడ్జి (ఆర్వోబీ) పనులు ఐదేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయని, దీంతో ట్రాఫిక్ రద్దీ కారణంగా నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ఆరోపించారు. ఆర్వోబీ నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గురువారం ఫాతిమానగర్ బ్రిడ్జి వద్ద బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి గత మేడారం జాతరలోపే కాజీపేట బ్రిడ్జి పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు మరోసారి మేడారం జాతర సమయం సమీపిస్తున్నా పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదని విమర్శించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండేళ్లు, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా కొనసాగుతున్నాయని ఆరోపించారు. పాత బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో రూ.78 లక్షల అంచనాతో టెండర్లు పిలిచినా, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయని విమర్శించారు. పనుల ఆలస్యానికి రైల్వే అనుమతుల పేరుతో నెపం నెట్టడం సరికాదని, కాంట్రాక్టర్ సామగ్రి, గడ్డర్లు సిద్ధం చేస్తే రైల్వే అనుమతులను కేంద్ర మంత్రులు జి. కిషన్‌రెడ్డి, అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే మంజూరు చేయించే బాధ్యత తమదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోయినా కాంట్రాక్టర్ పనులు కొనసాగించేందుకు వెనుకాడాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి కాజీపేట ఆర్వోబీ నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజల రవాణా ఇబ్బందులను తొలగించాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జి డా. పగడాల కాళీప్రసాద్‌రావు, పులి సర్వోత్తంరెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రూ.45 కోట్లతో రుద్రంగిలో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్‌కు భూమిపూజ

- **యువతకు ఆధునిక నైపుణ్యాలు, విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ**
- **మంత్రి వివేక్ వెంకటస్వామి**



**ప్రజానావ, రుద్రంగి/వేములవాడ :** యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక శిక్షణ అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో మంగళవారం రూ.45 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) భవన నిర్మాణానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రూ.4 వేల కోట్ల వ్యయంతో 65 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తోందని, ఐటీఐలను ఆధునీకరిస్తోందని తెలిపారు. గత రెండు న్నరేళ్లలో లక్ష ఉద్యోగ అవకాశాలు కల్పించామని, ఏటీసీల్లో శిక్షణ పొందే విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్టైపెండ్ అందిస్తున్నామని చెప్పారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఉద్యోగ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని విదేశీ భాషల్లో శిక్షణ ఇస్తున్నామని, రుద్రంగికి జర్మన్ భాషా శిక్షకుడిని పంపించి 100 మంది యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ వినియోగానికి అనుగుణంగా ఏటీసీల్లో కొత్త కోర్సులను ప్రవేశపెడతామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమ రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న మంత్రి, ఈ నెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త పెన్షన్లపై కీలక ప్రకటన చేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రుద్రంగిలో 1986లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుతో విద్యాభివృద్ధికి బాటలు పడ్డాయని అన్నారు. మూడపల్లిలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో 2,500 మంది విద్యార్థులు విద్యనభ్యసించే అవకాశం ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధి, విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు వంటి పనులు కొనసాగుతున్నాయని, త్వరలో హ్యామ్ విధానంలో మరిన్ని రోడ్ల అభివృద్ధి చేపడతామని చెప్పారు. కలికోట సూరమ్మ ప్రాజెక్టు కోసం రూ.45 కోట్లతో భూసేకరణ చేపట్టామని, పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. రుద్రంగి ఏటీసీలో 288 మంది విద్యార్థులకు ఏడు కోర్సుల్లో శిక్షణ అందుబాటులో ఉంటుందని, మర్రిపల్లిలో రైతు విజ్ఞాన కేంద్రం, ఆధునిక గోశాల కోసం చెరో 40 ఎకరాలు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కల్పన, శిక్షణ శాఖ డైరెక్టర్ ఐఏఎస్ ఏ. నిర్మల క్రాంతి వెస్లీ, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితె, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకుల తిరుపతి, ఆత్మ కమిటీ చైర్మన్ ముకుంద్ రెడ్డి, ఆర్డీఓ కేఎస్‌బీ కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసాచారి, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, మైనింగ్ శాఖ ఏడీ క్రాంతి, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్, సర్పంచ్ గండి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలి

## సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజానావ, సిరిసిల్ల :** విద్యార్థులు, యువత ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. స్కై రూట్ స్పేస్ ఏజెన్సీ వారి ఆధ్వర్యంలో ఇటీవల విజయవంతంగా ఆర్బిటర్ కక్షలోకి విక్రమ్ ఆగమన్ అంతరిక్ష రాకెట్ ప్రయోగంలో విశిష్ట సేవలందించిన సిరిసిల్ల యువ కెరటాలు అడుప సంతోష్ కుమార్, అడుప కిరణ్ కుమార్, బొమ్మ దేని నాగరాజును జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఘనంగా సన్మానించి.. వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా అడుప సంతోష్ కుమార్, అడుప కిరణ్ కుమార్, బొమ్మ దేని నాగరాజును విద్యార్థులు, యువత స్పేస్ సిస్టమ్, లాంచింగ్ వెహికల్స్, దానిలో వాడే టెక్నాలజీ, వారికి ఎదురైన సవాళ్లు, ఈ రంగంలో ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లా యువకులు స్పేస్ ఏజెన్సీలో సేవలు అందించడం గర్వకారణమని కొనియాడారు. స్కై రూట్ సంస్థ ఇప్పటి వరకు విక్రమ్ వన్, విక్రమ్ ఎస్ ప్రయోగాలు చేసిందని గుర్తు చేశారు. తమను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సన్మానించడం చాలా సంతోషంగా ఉందని అడుప కిరణ్ కుమార్ తెలిపారు. ఇది చాలా గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత చదివే సమయంలో శ్రద్ధపెట్టాలని సూచించారు. తాను ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, జిల్లా విద్యాధికారి మొండయ్య, జేఎన్ టీయూ ప్రిన్సిపాల్ వేణుగోపాల్, జిల్లా సైన్స్ అధికారి దేవయ్య, పాలిటెక్నిక్ కళాశాల, వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన యువతే వికసిత్ భారత్‌కు బలం

## ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

**ప్రజానావ, ఆదిలాబాద్:** ఆరోగ్యవంతమైన యువతే తెలంగాణ రైజింగ్, వికసిత్ భారత్‌కు నిజమైన బలమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. పట్టణంలోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'నశా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం దేశవ్యాప్తంగా బ్రహ్మకుమారీస్ చేపట్టిన 10 కోట్ల మంది వ్యసన విముక్తి ప్రతిజ్ఞ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, వివిధ సంఘాల ప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించి, 'నశా ముక్త్ భారత్' పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అతిథులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు అంటే కేవలం గంజాయి, కొకైన్ మాత్రమే కాదని, మద్యం, పొగాకు, జర్దా వంటి అలవాట్లు కూడా తీవ్ర వ్యసనాలుగా మారి జీవితాలను నాశనం చేస్తాయని హెచ్చరించారు. నేటి కాలంలో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, మొబైల్ ఫోన్ల అధిక వినియోగం వంటి డిజిటల్ వ్యసనాలు కూడా యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ పేర్కొన్న సామాజిక పాపాలను గుర్తు చేస్తూ విద్యతో పాటు విలువలు, వ్యక్తిత్వ వికాసం ప్రతి ఒక్కరికీ అవసరమని చెప్పారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో వ్యసన విముక్తిపై అవగాహన కల్పించేందుకు ప్రతి గురువారం 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఈ వ్యసన విముక్తి ప్రతిజ్ఞ కార్యక్రమం వచ్చే 15 రోజుల పాటు విస్తృతంగా కొనసాగుతుందని వెల్లడించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ వ్యసనాలకు దూరంగా ఉండటమే ఆరోగ్యవంతమైన జీవితానికి పునాదని అన్నారు. చెడు అలవాట్లు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక స్థైర్యాన్ని, ఆలోచనా విధానాన్ని దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుత యువత వ్యసనాల బారిన పడి ఆవేశం, కోపానికి లోనవుతూ కుటుంబ సంబంధాలను దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పెద్దలను గౌరవించాలని, సంయమనంతో ప్రవర్తించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, డీఈవో మాధవి, డీఐఈవో గణేష్, డీపీఆర్‌వో విష్ణువర్ధన్, ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ రామయ్య, బ్రహ్మకుమారీస్ నిర్వాహకులు రేవతి, దిల్‌రెడ్డి, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# వరదలో చిక్కుకున్న 45 మంది ప్రయాణికుల సురక్షితం

- **బస్సులో చిక్కుకున్న వారిని రోప్‌ల సాయంతో బయటకు తీసిన పోలీసులు, ఫైర్ సిబ్బంది**
- **సమయస్ఫూర్తితో స్పందించి పెను ప్రమాదాన్ని తప్పించిన రెస్క్యూ బృందాలు**

**ప్రజానావ, కామారెడ్డి:** భారీ వర్షాల కారణంగా వరద నీటిలో చిక్కుకున్న ప్రైవేట్ బస్సులోని 45 మంది ప్రయాణికులను పోలీసులు, ఫైర్ శాఖ సిబ్బంది సాహసోపేతంగా రక్షించారు. మంగళవారం కామారెడ్డి పట్టణంలోని రామారెడ్డి రోడ్డులో అంజిల్‌రెడ్డి ఆసుపత్రి–సుభాష్ టాకీస్ సమీపంలో రోడ్డుపై భారీగా వరద నీరు ప్రవహిస్తుండగా, గొల్లపల్లి నుంచి రంగంపేటకు పెళ్లి కార్యక్రమానికి వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు సైలెన్సర్‌లో నీరు చేరడంతో మధ్య రోడ్డులోనే నిలిచిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే కామారెడ్డి పోలీసులు, ఫైర్ శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అంచనా వేశారు. వేగంగా ప్రవహిస్తున్న వరద నీటిని లెక్కచేయకుండా రోప్‌ల సహాయంతో బస్సులో చిక్కుకున్న 45 మంది ప్రయాణికులను ఒక్కొక్కరిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అనంతరం ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ బస్సు ఏర్పాటు చేసి వారి గమ్యస్థానాలకు పంపించారు. పోలీసు, ఫైర్ శాఖల సమయస్ఫూర్తి, ధైర్యసాహసాలు, పరస్పర సమన్వయంతో చేపట్టిన సహాయక చర్యల వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా పెను ప్రమాదం తప్పింది.



# రాజన్న ఆలయ అభివృద్ధి పనులు శరవేగం

## విప్ ఆది శ్రీనివాస్

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో అభివృద్ధి, విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆలయంలో జరుగుతున్న తూర్పు గోపురం, అన్విటి మండపం తదితర పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం సుమారు 55 శాతం పనులు పూర్తయ్యాయని, ఆలయ అభివృద్ధికి మొత్తం రూ.249.40 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు

# పార్కులు, వైకుంఠధామాలు ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- **ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఏర్పాట్లను పరిశీలించిన జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టీ. వెంకన్న**
- **పరిశుభ్రత, హరితీకరణ, మౌలిక సదుపాయాల నిర్వహణపై అధికారులకు కీలక ఆదేశాలు**



**ప్రజానావ, వరంగల్:** నగరంలోని పార్కులు, వైకుంఠధామాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో, ప్రజలకు ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని పలు పార్కులు, వైకుంఠధామాలను క్షేత్రస్థాయిలో సందర్శించిన ఆయన నిర్వహణ తీరు, అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ముందుగా హనుమకొండ బాలసముద్రం 30వ డివిజన్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ పార్కును సందర్శించిన కమిషనర్, ఇప్పటికే పూర్తయిన అభివృద్ధి పనులను పరిశీలించారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాల ఏర్పాట్లను సమీక్షించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. జయంతి నాటికి పార్కు మరింత ఆకర్షణీయంగా కనిపించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పూర్తయిన పనుల నాణ్యతను పరిశీలించిన ఆయన, మిగిలిన అభివృద్ధి పనులను దశలవారీగా వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. పార్కులో హరితీకరణ విస్తరణ, వాకింగ్ ట్రాక్‌ల నిర్వహణ, విద్యుత్ దీపాల ఏర్పాటు, పరిశుభ్రతతో పాటు సందర్శకులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. అనంతరం 54వ డివిజన్ పోచమ్మకుంటలోని వైకుంఠధామంతో పాటు 57వ డివిజన్ టీవీ టవర్ ప్రాంతంలోని వైకుంఠధామాన్ని సందర్శించి అక్కడి నిర్వహణను పరిశీలించారు. వైకుంఠధామాల్లో నిరంతర పారిశుద్ధ్య నిర్వహణ, హరితీకరణ, మొక్కల సంరక్షణ, అంతర్గత రహదారుల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాల నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైకుంఠధామాల నిర్వహణను అత్యుత్తమ ప్రమాణాలతో కొనసాగించాలని, నగరంలోని పార్కులు, వైకుంఠధామాలు పరిశుభ్రత, పచ్చదనం, సౌకర్యాల పరంగా ఆదర్శంగా నిలిచేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రాజారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్, అసిస్టెంట్ ఇంజినీర్ హరి తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ @2047 సాధనలో యువత కీలకం

**ప్రజానావ, సిరిసిల్ల:** జేఎన్‌టీయూహెచ్ రాజన్న సిరిసిల్ల కళాశాలలో నిర్వహించిన నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ @2047 కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ముఖ్య అతిథులు యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ బాధ్యతాయుతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ స్థానం సాధించిన విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ ప్రిన్సిపాల్ డా. టి. వేణుగోపాల్‌తో పాటు పలువురు అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.




# తల్లి పాలలోనే శిశువుకు పూర్తి పోషకాలు

**ప్రజానావ, సిరిసిల్ల:** ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన తొలి గంటలోనే తల్లి పాలు ఇవ్వాలని, మొదటి ఆరు నెలలు తల్లి పాలే శిశువుకు ఉత్తమ ఆహారమని సూచించారు. తల్లి పాల వల్ల శిశువుకు పూర్తి పోషకాలు అందడంతో పాటు తల్లి ఆరోగ్యానికీ మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బాలింతలకు పండ్లు పంపిణీ చేసి, తల్లి పాల ప్రాముఖ్యతపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. నర్సింగ్ విద్యార్థులు అవగాహన నాటిక ప్రదర్శించారు. జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





# నటి త్రిషపై అనుచిత వ్యాఖ్యలు

- మాజీ డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్, విడుదల
- రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే నిరసనలు
- అసెంబ్లీ సమావేశాల ముందు తమిళనాట వేడెక్కిన రాజకీయాలు

**చెన్నై:** నటి త్రిషను ఉద్దేశించి అసభ్యకరమైన ద్వంద్వార్థ వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో తమిళనాడు మాజీ ఉప ముఖ్యమంత్రి, డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్‌ను మంగళవారం తంజావూరు పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం విచారణ నిర్వహించి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. కావేరి సమస్యపై సోమవారం తంజావూరులో జరిగిన నిరసన సభలో చేసిన వ్యాఖ్యలపై కేసు నమోదైంది. మహిళ గౌరవానికి భంగం కలిగించడం, అసభ్య పదజాలం వినియోగం, విద్వేషం రెచ్చగొట్టడం, అల్లర్లకు ప్రేరేపించడం, బెదిరింపులు తదితర తొమ్మిది సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. తమిళనాడు మహిళల వేధింపుల నిరోధక చట్టంలోని నిబంధనలను కూడా వర్తింపజేశారు. ఉదయనిధిని అరెస్టు చేసేందుకు పోలీసులు ఆయన చెన్నై నివాసానికి చేరుకోవడంతో డీఎంకే కార్యకర్తలు పెద్దఎత్తున నిరసనకు దిగారు. ఇదే సమయంలో ముందస్తు బెయిల్ కోసం మద్రాస్ హైకోర్టును డీఎంకే ఆశ్రయించింది. అయితే విచారణకు ముందే పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఉదయనిధి అరెస్టును డీఎంకే అధ్యక్షుడు ఎం.కే. స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా అడ్డుకునేందుకే ప్రభుత్వం ఈ చర్యలకు పాల్పడిందని ఆరోపించారు. మరోవైపు అధికార టీవీకే చర్యను సమర్థించగా, డీఎంకే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు దిగింది.

# యువతతో యువతే మాట్లాడాలి

- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే

**ముంబై:** ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ జెన్–జెడ్, జెన్–ఆల్ఫా విద్యార్థులతో నిర్వహించనున్న సంభాషణను స్వాగతిస్తున్నప్పటికీ, అలాంటి కార్యక్రమాల్లో యువతే ముందుండాలని కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. యువతతో సంభాషణ అవసరమే. అయితే 70–80 ఏళ్ల వారు కాకుండా యువతతో యువతే మాట్లాడితే మరింత ప్రభావం ఉంటుంది. జెన్–జెడ్‌కు యువ ప్రతినిధులే అవసరం అని ఆయన వ్యాఖ్యానించారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఉద్యమాల తర్వాత యువతను విస్మరించలేమని అధికార వర్గాలు గ్రహించాయని కూడా అన్నారు. అదేవిధంగా, జేపీఎస్సీ పరీక్షల పేపర్ లీకేజీ ఆరోపణలపై రాంచీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులకు సీజేపీ మద్దతు ప్రకటించింది. వారికి కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని ఆరోపించిన దీప్కే, ఈ వ్యవహారంపై స్వతంత్ర కమిటీతో విచారణ జరిపించాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు.

# థర్డ్‌పార్టీ బీమా లేకుంటే నో పెట్రోల్

- వాహనాలకు చెల్లుబాటయ్యే బీమా ఉంటేనే ఇంధనం ఇవ్వాలి
- కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన
- పైలట్ ప్రాజెక్టు రూపొందించాలని ఆదేశం



**న్యూఢిల్లీ:** దేశంలో థర్డ్‌పార్టీ బీమా లేకుండా పెద్ద సంఖ్యలో వాహనాలు తిరుగుతున్నాయంటూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు, చెల్లుబాటు అయ్యే బీమా లేని వాహనాలకు పెట్రోల్ బంకుల్లో ఇంధనం ఇవ్వకుండా పైలట్ ప్రాజెక్టు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంగళవారం ఆదేశించింది. ఇందుకు బీమా నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏఐ), రహదారుల రవాణా మంత్రిత్వ శాఖ (ఎంఓఆర్‌టిహెచ్) కలిసి కార్యాచరణ రూపొందించాలని సూచించింది. జస్టిస్‌లు సంజయ్ కరోల్, ప్రశాంత్‌కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం, దేశంలో సుమారు 30.48 కోట్ల వాహనాల్లో 16.54 కోట్ల వాహనాలకు (దాదాపు 56 శాతం) థర్డ్‌పార్టీ బీమా లేదని ఆర్థిక వ్యవహారాల స్థాయీ సంఘం నివేదికను ప్రస్తావించింది. ఈ పరిస్థితి ప్రమాద బాధితులకు సకాలంలో పరిహారం అందకుండా చేస్తోందని వ్యాఖ్యానించింది. కొత్త కార్లు కొనుగోలు చేసే వారు ఇకపై నాలుగేళ్ల థర్డ్‌పార్టీ బీమా, కొత్త ద్విచక్ర వాహనాలకు ఆరేళ్ల థర్డ్‌పార్టీ బీమా తప్పనిసరిగా తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. దీనిపై వెంటనే అవసరమైన మార్గదర్శకాలు జారీ చేయాలని ఐఆర్‌డీఏఐని ఆదేశించింది.

### ఈ–చలాన్లు, ఏఎన్‌పీఆర్ కెమెరాలు

బీమా లేని వాహనాలను గుర్తించేందుకు ఏఎన్‌పీఆర్ (ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్) కెమెరాలు ఏర్పాటు చేసి, వాహన్ పోర్టల్, ఇన్సూరెన్స్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డేటాతో అనుసంధానం చేసి ఆటోమేటిక్‌గా ఈ–చలాన్లు జారీ చేయాలని కోర్టు సూచించింది. అలాగే రాష్ట్ర పోలీసులకు బీమా స్థితిని తక్షణమే పరిశీలించే హ్యాండ్‌హెల్డ్ పరికరాలు లేదా మొబైల్ యాప్‌లు అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. జాతీయ రహదారులపై టోల్‌ప్లాజాల వద్ద వాహనాల రద్దీని తగ్గించేందుకు, వాహనాలను ఆపకుండా ఆటోమేటిక్ గుర్తింపు వ్యవస్థ ద్వారా టోల్ వసూలు చేసే పైలట్ ప్రాజెక్టులను ఎంపిక చేసిన కారిడార్లలో అమలు చేయాలని కూడా కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# నీట్ పీజీ ప్రవేశాలపై సమగ్ర ఆడిట్

- డీజీహెచ్ఎస్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ
- లోపాల గుర్తింపు, పరిష్కారాలపై నివేదికకు ఎనిమిది వారాల గడువు
- కటాఫ్ తగ్గింపుపై సుప్రీంకు కేంద్రం సమాచారం

నీట్–పీజీ 2025 ప్రవేశాల ప్రక్రియలో కటాఫ్ పర్సంటైల్ తగ్గింపుపై దేశవ్యాప్తంగా వ్యక్తమైన అభ్యంతరాల నేపథ్యంలో, మొత్తం ప్రవేశ వ్యవస్థపై సమగ్ర అంతర్గత ఆడిట్ నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) అధ్యక్షతన 12 మంది సభ్యులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్రం మంగళవారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఈ వ్యవహారాన్ని జస్టిస్‌లు పి.ఎస్. నరసింహ, అలోక్ ఆరాధే ధర్మాసనం విచారించింది. కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి, జూలై 23న జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు కోర్టుకు వివరించారు. ప్రస్తుత నీట్–పీజీ ప్రవేశ విధానాన్ని సమగ్రంగా సమీక్షించడం, అందులో ఉన్న లోపాలను గుర్తించడం, భవిష్యత్తులో మరింత పారదర్శకంగా, సమర్థంగా ప్రవేశాల నిర్వహణకు అవసరమైన ఆచరణాత్మక సూచనలు చేయడం కమిటీ ప్రధాన బాధ్యతలుగా పేర్కొన్నారు. కమిటీ తన నివేదికను ఎనిమిది వారాల్లో సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అవసరమైతే భారతీయ వైద్య విధానాల జాతీయ కమిషన్ (ఎన్‌సీఐ ఎస్ఎం), హోమియోపతి జాతీయ కమిషన్ (ఎన్‌సీఎచ్) ప్రతినిధులను కూడా కమిటీలో చేర్చుకోవచ్చని ధర్మాసనం సూచించింది. ఇదిలా ఉండగా, నీట్–పీజీ 2025లో అర్హత కటాఫ్ పర్సంటైల్‌ను 50 నుంచి 7కు తగ్గించడాన్ని పలువురు పిటిషనర్లు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ నిర్ణయం వైద్య విద్యా ప్రమాణాలను దెబ్బతీస్తుందని వారు వాదించారు. అయితే కటాఫ్ తగ్గింపు అసాధారణ నిర్ణయం కాదని, గతంలోనూ ఖాళీగా మిగిలిన పీజీ సీట్లను భర్తీ చేయడానికి ఇలాంటి చర్యలు తీసుకున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది. 2023లో అన్ని విభాగాల్లో కటాఫ్‌ను సున్నా పర్సంటైల్ వరకు తగ్గించిన విషయాన్ని కూడా కోర్టు దృష్టికి తీసుకువచ్చింది.

### వైద్య సామర్థ్యం కాదు.. మెరిట్ జాబితా రూపొందించడమే

నీట్–పీజీ పరీక్ష ఉద్దేశం అభ్యర్థుల కనీస వైద్య సామర్థ్యాన్ని నిర్ధారించడం కాదని, పీజీ ప్రవేశాల కోసం మెరిట్ జాబితా రూపొందించడమేనని కేంద్రం పేర్కొంది. 2025–26 విద్యా సంవత్సరానికి దేశవ్యాప్తంగా సుమారు 70 వేల పీజీ సీట్లు అందుబాటులో ఉండగా, రెండో విడత కౌన్సెలింగ్ పూర్తయ్యే సమయానికి అఖిల భారత కోటాలో 9,621 సీట్లు ఖాళీగా మిగిలాయని వివరించింది. వీటిలో 5,213 ప్రభుత్వ వైద్య కళాశాలలకు చెందిన సీట్లేనని, ప్రభుత్వ వైద్య సీట్లు వృథా కాకుండా ఉండటంతో పాటు అందుబా టులో ఉన్న సీట్లను పూర్తిగా భర్తీ చేయాలనే ఉద్దేశంతోనే కటాఫ్ పర్సంటైల్‌ను తగ్గించినట్లు కేంద్రం సుప్రీంకోర్టుకు వెల్లడించింది.



# ఎర్ర సముద్రంలో భారత నౌకపై దాడి

- యెమెన్ తీరంలో మునిగిన భారత జెండా వాణిజ్య నౌక
- 13మంది భారతీయులు సురక్షితం
- దాడిని ఖండించిన భారత్

**న్యూఢిల్లీ:** యెమెన్ తీరంలోని ఎర్ర సముద్రంలో భారత జెండాతో ప్రయాణిస్తున్న ఎంఎస్‌వీ ఫైజే నూరే ఒలియా అనే వాణిజ్య నౌకపై మంగళవారం దాడి జరిగింది. ఈ ఘటనలో నౌక మునిగిపోయినప్పటికీ, అందులో ఉన్న 13 మంది భారతీయులను సురక్షితంగా రక్షించినట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) తెలిపింది. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం యెమెన్ అధికారులతో సమన్వయం చేస్తూ సిబ్బంది భద్రతను పర్యవేక్షిస్తోందని పేర్కొంది. రక్షణ చర్యలకు సహకరించిన యెమెన్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపింది. ఎర్ర సముద్ర ప్రాంతంలో వాణిజ్య నౌకలపై వరుస దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని విదేశాంగ శాఖ పేర్కొంది. అంతర్జాతీయ జలమార్గాల్లో స్వేచ్ఛాయుత, నిరంతర వాణిజ్య రవాణా పునరుద్ధరించేందుకు ఇటువంటి దాడులు వెంటనే నిలిపివేయాలని అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేసింది

# ఒమన్ తీరంలో భారీ విపత్తు

- ట్యాంకర్ నుంచి లీకైన ముడి చమురు 150 చ.కి.మీ. మేర విస్తరణ
- వారం రోజుల్లోనే ఏడు రెట్లు పెరిగిన మరక
- సముద్ర జీవులు, తీర పర్యావరణానికి ముప్పు
- తాజా ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించిన గ్రీన్‌పీస్ జర్మనీ

**బీరూట్ :** ఒమన్ తీరానికి సమీపంలో ఒడ్డుకు చిక్కుకుని ఉన్న చమురు ట్యాంకర్ నుంచి భారీగా ముడి చమురు లీకవుతుండటంతో సముద్ర పర్యావరణంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. తాజా ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించిన పర్యావరణ సంస్థ 'గ్రీన్‌పీస్ జర్మనీ' ప్రకారం.. లీకైన చమురు మరక ఇప్పటికే సుమారు 150 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణానికి వ్యాపించింది. ఈ లీకేజీ తీర ప్రాంతాలతో పాటు సముద్ర జలాలను కూడా కలుషితం చేస్తూ పర్యావరణానికి పెను ముప్పుగా మారుతోంది. వారం రోజుల క్రితం కేవలం 20 చదరపు కిలోమీటర్ల పరిధిలో మాత్రమే ఉన్న చమురు మరక ప్రస్తుతం ఏడు రెట్లకు పైగా విస్తరించినట్లు పర్యావరణ నిపుణులు వెల్లడించారు. 274 మీటర్ల పొడవైన 'కరోలిన్ బెజెంగి' స్యూజ్‌మాక్స్ ట్యాంకర్ నుంచి నిరంతరంగా చమురు లీకవుతోంది. రష్యా ముడి చమురును రవాణా చేసిన కారణంగా ఈ నౌకపై బ్రిటన్, యూరోపియన్ యూనియన్, కెనడా, స్విట్జర్లాండ్ ఇప్పటికే ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే.

### సముద్ర జీవుల మనుగడపై ప్రభావం

లీకైన చమురు ఒమన్‌లోని ఖిబ్లియా ద్వీప తీరాలను తాకడంతో పాటు అరేబియా సముద్రంలోని సంరక్షిత సముద్ర జీవావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే పరిస్థితి నెలకొంది. అంతరించిపోతున్న పక్షి జాతులు, అరుదైన అరేబియా సముద్ర హంప్‌బ్యాక్ తిమింగలాలు సహా అనేక సముద్ర జీవుల మనుగడపై ఈ లీకేజీ ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ట్యాంకర్‌లో సుమారు ఎనిమిది లక్షల బ్యారెళ్లకు పైగా ముడి చమురు ఉన్నట్లు అంచనా. జూన్‌లో జరిగిన పేలుడు అనంతరం నౌక ఒడ్డుకు చిక్కుకుపోయిందని సమాచారం. నౌకను, అందులోని ముడి చమురును జూలై 23లోగా తొలగించాలని ఒమన్ ప్రభుత్వం యజమానులను ఆదేశించినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని అధికారులు వెల్లడించారు.



# చర్చలకు ఇస్లామాబాద్‌కు రండి

### అమెరికా – ఇరాన్ ఉద్రిక్తతల వేళ ఇరాన్ విదేశాంగ మంత్రికి పాక్ ఆహ్వానం

**లాహోర్:** అమెరికా–ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీని వీలైనంత త్వరగా ఇస్లామాబాద్‌కు రావాలని పాకిస్థాన్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఆహ్వానించారు. తెహ్రాన్–వాషింగ్టన్ మధ్య మధ్యవర్తిగా తన పాత్రను కొనసాగించాలనే ఉద్దేశంతో పాకిస్థాన్ ఈ చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దార్, అరాఘ్చీ ఫోన్‌లో ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలతో పాటు తూర్పు జెరూసలేం పరిస్థితిపై చర్చించారు. ఇటీవల అమెరికా–ఇరాన్ మధ్య జరిగిన చర్చల్లో పాకిస్థాన్ మధ్యవర్తిగా వ్యవహరించిన విషయం తెలిసిందే. కాగా, ట్రంప్ ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్నాయని ప్రకటించగా, తెహ్రాన్ దాన్ని ఖండించింది. అయినప్పటికీ అమెరికా–ఇరాన్ చర్చల్లో పాకిస్థాన్ మధ్యవర్తిత్వం కొనసాగుతోందని ఇరాన్ మరోసారి స్పష్టం చేసింది.



# భారీ వర్షాలతో శ్రీలంక అతలాకుతలం

- వరదలు, కొండచరియలు విరిగిపడి ఏడుగురు మృతి
- 3,500 మందికిపైగా సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- సహాయక చర్యల్లో సైన్యం, నౌకాదళం
- పలు జిల్లాల్లో పాఠశాలలకు సెలవు

**కొలంబో:** శ్రీలంకలో గత రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాలు తీవ్ర విధ్వంసానికి దారితీశాయి. వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, దేశంలోని మధ్య పర్వత ప్రాంతాలు అత్యధికంగా ప్రభావితమయ్యాయి. పరిస్థితులు విషమించడంతో పలు జిల్లాల్లో పాఠశాలలకు అధికారులు సెలవు ప్రకటించారు. విపత్తు నిర్వహణ కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం, కొండచరియలు విరిగిపడి రెండు ఇళ్లు కూలిపోవడంతో ఐదుగురు మృతి చెందగా, వరదల కారణంగా మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనల్లో ముగ్గురు గాయపడగా, 291 ఇళ్లు దెబ్బతిన్నాయి. ప్రభావిత ప్రాంతాల నుంచి సుమారు 3,500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించి సహాయక శిబిరాల్లో ఆశ్రయం కల్పించారు. వరదల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు శ్రీలంక సైన్యం, నౌకాదళాన్ని ప్రభుత్వం రంగంలోకి దించింది. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో రహదారులపై భారీ బండరాళ్లు, చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడగా, సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి. గతేడాది నవంబరులో సంభవించిన 'దిట్వా' తుపాను వల్ల శ్రీలంక తీవ్ర నష్టాన్ని చవిచూసింది. ఆ విపత్తులో దాదాపు 640 మంది మరణించగా, సుమారు 20 లక్షల మంది ప్రభావితమయ్యారు. ఆ తుపాను గాయాలు ఇంకా పూర్తిగా మానకముందే తాజా భారీ వర్షాలు, వరదలు దేశాన్ని మరోసారి సంక్షోభ పరిస్థితుల్లోకి నెట్టాయి.

# అమెరికాలో 25 మంది పౌరసత్వ రద్దుకు చర్యలు

**వాషింగ్టన్:** తప్పుడు గుర్తింపుతో అమెరికా పౌరసత్వం పొందడం, ఇతర తీవ్రమైన నేరాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 25 మంది సహజీకృత పౌరులపై పౌరసత్వాన్ని రద్దు చేసే ప్రక్రియను అమెరికా న్యాయశాఖ ప్రారంభించింది. ఈ జాబితాలో భారత సంతతికి చెందిన 65 ఏళ్ల నరిందర్ సింగ్ కూడా ఉన్నారు. తప్పుడు గుర్తింపుతో 1996లో అమెరికాలో ప్రవేశించిన ఆయన, అదే ఆధారాలతో 2008లో అమెరికా పౌరసత్వాన్ని పొందినట్లు న్యాయశాఖ ఆరోపించింది. జులై 20 నుంచి ఆగస్టు 3 మధ్య నమోదైన ఈ కేసులు భారత్, పాకిస్థాన్‌తో పాటు మొత్తం 17 దేశాలకు చెందిన సహజీకృత అమెరికా పౌరులపై దాఖలయ్యాయి. వీరిపై తప్పుడు సమాచారం సమర్పించడం, హత్యా యత్నం, చిన్నారులపై లైంగిక నేరాలు, గృహహింస, వివాహ మోసం, గుర్తింపు, పాస్‌పోర్టు, బ్యాంకింగ్ మోసాలు తదితర తీవ్రమైన ఆరోపణలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. అమెరికా పౌరసత్వం అత్యంత విలువైన హక్కు అని, దాన్ని చట్టబద్ధమైన మార్గంలోనే పొందాలని తాత్కాలిక అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచ్ స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి లేదా మోసపూరితంగా పౌరస త్వం పొందిన వారిపై కఠిన చర్యలు కొనసాగు తాయని ఆయన తెలిపారు. అమెరికా చరిత్రలోనే సమన్వయంతో చేపట్టిన అతిపెద్ద పౌరసత్వ రద్దు చర్య ఇదేనని న్యాయశాఖ పేర్కొంది. ట్రంప్ ప్రభుత్వం 2025 జనవరి నుంచి ఇప్పటివరకు మొత్తం 123 పౌరసత్వ రద్దు కేసులను కోర్టుల్లో దాఖలు చేసినట్లు వెల్లడించింది.

# భయపెట్టిన టర్బులెన్స్

- ఫుకెట్-ఢిల్లీ ఎయిరిండియా విమానంలో కలకలం
- ఒక్కసారిగా 300 అడుగులకు జారిన విమానం
- 17 మందికి గాయాలు.. సురక్షితంగా ల్యాండింగ్ చేసిన పైలట్లు
- క్షతగాత్రులను పరామర్శించిన కేంద్ర మంత్రి



**న్యూఢిల్లీ:** థాయ్‌లాండ్‌లోని ఫుకెట్ నుంచి ఢిల్లీకి వస్తున్న ఎయిరిండియా విమానం మంగళవారం ప్రయాణ మధ్యలో తీవ్ర టర్బులెన్స్‌కు గురై ఒక్కసారిగా సుమారు 300 అడుగుల మేర కిందకు జారడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో మొత్తం 17 మంది గాయపడగా, వారిలో ఒక క్యాబిన్ సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. అయినప్పటికీ పైలట్లు అప్రమత్తంగా వ్యవహరించి విమానాన్ని ఢిల్లీ విమానాశ్రయంలో సురక్షితంగా దించారు. ఎయిరిండియాకు చెందిన ఏఐ–2379 (ఏఐ2379) ఎయిర్‌బస్ ఏ320 నియో విమానంలో 137 మంది ప్రయాణికులు, ఎనిమిది మంది సిబ్బంది ఉన్నారు. ఉదయం 11.07 గంటలకు విమానం సురక్షితంగా ఢిల్లీకి చేరినట్లు ఎయిరిండియా వెల్లడించింది. తీవ్రగాలుల కారణంగా విమానం ఒక్కసారిగా ఎత్తు కోల్పోవడంతో 13 మంది ప్రయాణికులు, నలుగురు క్యాబిన్ సిబ్బంది గాయపడ్డారు. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఎయిరిండియా వివరాల ప్రకారం ఐదుగురు ప్రయాణికులు చికిత్స అనంతరం డిశ్చార్జి కాగా, కేంద్ర పౌర విమానయాన శాఖ ప్రకారం ఎనిమిది మంది ప్రయాణికులు, నలుగురు క్యాబిన్ సిబ్బంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

### డీజీసీఏ దర్యాప్తు

ఈ ఘటనపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ దర్యాప్తు ప్రారంభించింది. ఫ్లైట్ డేటా రికార్డర్ (ఎఫ్‌డీఆర్), కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సీవీఆర్)లను స్వాధీనం చేసుకుని సాంకేతిక విశ్లేషణ చేపట్టనున్నారు. ఘటన అనంతరం విమానాన్ని హ్యాంగర్‌కు తరలించారు. కేంద్ర పౌర విమానయాన మంత్రి కె. రామ్మోహన్ నాయుడు, శాఖ కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా, డీజీసీఏ డైరెక్టర్ జనరల్ వీర్ విక్రమ్ యాదవ్‌తో కలిసి ఢిల్లీలోని ఫోర్టిస్ ఆసుపత్రిని సందర్శించి క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రతికూల వాతావరణంలో టర్బులెన్స్ సంభవించడం సాధారణమే అయినప్పటికీ, దాని వల్ల ప్రయాణికులు, విమాన సిబ్బందికి గాయాలు కావడం అరుదైన విషయమని విమానయాన నిపుణులు పేర్కొంటున్నారు.



# కొలంబోకు చేరిన టీమిండియా

- సాయి సుదర్శన్ లేకుండానే పయనమైన జట్టు • కాలివేలు గాయం నుంచి కోలుకుంటున్న యువ బ్యాటర్
- బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లోనే పునరావాసం • ఆగస్టు 7 నుంచి వార్మప్ మ్యాచ్, 15న తొలి టెస్టు

**బెంగళూరు:** శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్ కోసం శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని భారత జట్టు మంగళవారం కొలంబో చేరుకుంది. అయితే అగ్రశ్రేణి బ్యాటర్ బి. సాయి సుదర్శన్ మాత్రం కాలివేలు గాయం నుంచి కోలుకుంటున్నందున జట్టుతో వెళ్లలేదు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో వైద్య బృందం పర్యవేక్షణలో సుదర్శన్ పునరావాసం కొనసాగుతోంది. నెట్స్‌లో గంటకు పైగా బ్యాటింగ్ చేస్తున్న అతడి ఫిట్‌నెస్‌ను మరో మూడు–నాలుగు రోజులు పరిశీలించిన తర్వాత జట్టులో చేరికపై నిర్ణయం తీసుకోనున్నారు. భారత జట్టు ఆగస్టు 7 నుంచి కొలంబోలోని నాన్‌డిస్క్రిప్ట్స్ క్రికెట్ క్లబ్‌తో మూడు రోజుల వార్మప్ మ్యాచ్ ఆడనుంది. అనంతరం ఆగస్టు 15 నుంచి గాలేలో తొలి టెస్టు, ఆగస్టు 23 నుంచి కొలంబోలో రెండో టెస్టు జరగనుంది.

## పతకాలే కాదు.. భావితరాలకు మార్గదర్శకులూ కావాలి

- కామన్వెల్త్ పతక విజేతలకు నగదు ప్రోత్సాహకాలు అందజేసిన కేంద్ర క్రీడల మంత్రి
- ప్రభుత్వ ఉద్యోగాలే లక్ష్యంగా కాకుండా అకాడమీలు ప్రారంభించాలని సూచన
- ఆసియా క్రీడల్లో మరిన్ని స్వర్ణాలు సాధించాలని పిలుపు




**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ క్రీడల్లో పతకాలు సాధించిన బాక్సింగ్, జూడో, పారా అథ్లెటిక్స్ క్రీడాకారులను కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ మంగళవారం సన్మానించి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. స్వర్ణ పతక విజేతలకు రూ.30 లక్షలు, రజత విజేతలకు రూ.20 లక్షలు, కాంస్య పతక విజేతలకు రూ.10 లక్షలు చొప్పున బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మాండవీయ మాట్లాడుతూ, కామన్వెల్త్ పతకాలను కేవలం ప్రభుత్వ ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చే లక్ష్యంతో సాధించాలని అన్నారు.

క్రీడా జీవితం ముగిసిన తర్వాత అకాడమీలు స్థాపించి యువ క్రీడాకారులను తీర్చిదిద్దాలని సూచించారు. గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో భారత బాక్సర్లు ఏడు స్వర్ణాలు, మూడు రజతాలతో మొత్తం 10 పతకాలు సాధించగా, జూడోలో చరిత్రలోనే తొలిసారి రెండు స్వర్ణాలతో కలిపి నాలుగు పతకాలు గెలిచింది. సెప్టెంబర్–అక్టోబర్‌లో జపాన్‌లో జరిగే ఆసియా క్రీడల్లో కూడా ఇదే జోరును కొనసాగించి మరిన్ని స్వర్ణాలు సాధించాలని మంత్రి పిలుపునిచ్చారు. అలాగే ప్రతి క్రీడాకారుడి విజయానికి కోచ్‌ల పాత్ర అమూల్యమని, వారిని ఎప్పటికీ మరవొద్దని సూచించారు.

## జాఫ్నా కింగ్స్ సహ యజమానిగా జహీర్

- లంక ప్రీమియర్ లీగ్ ఫ్రాంచైజీని కొనుగోలు చేసిన యాంకర్ స్పోర్ట్స్
- యాంకర్ జాఫ్నా కింగ్స్‌గా మార్పు

**కొలంబో:** భారత మాజీ పేసర్ జహీర్ ఖాన్ లంక ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్)లోని నాలుగుసార్లు ఛాంపియన్ జాఫ్నా కింగ్స్‌కు సహ యజమానిగా చేరారు. స్టాక్‌హోమ్‌కు చెందిన యాంకర్ స్పోర్ట్స్ ఏబీ ఫ్రాంచైజీని కొనుగోలు చేయడంతో జట్టు పేరును 'యాంకర్ జాఫ్నా కింగ్స్'గా మార్చారు. జాఫ్నా కింగ్స్ మాజీ సహ యజమాని, భారత మాజీ అండర్–19 క్రికెటర్ మంజోత్ కల్రాపై మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు రావడంతో శ్రీలంక క్రికెట్ బోర్డు పాత ఫ్రాంచైజీ ఒప్పందాన్ని రద్దు చేసింది. దీంతో యాంకర్ స్పోర్ట్స్ యాజమాన్యం చేపట్టింది. శ్రీలంక ఎప్పటికీ గొప్ప బౌలర్లను తయారు చేసే దేశమని, అక్కడ యజమానిగా భాగస్వామి కావడం సంతోషంగా ఉందని జహీర్ ఖాన్ తెలిపారు. ప్రస్తుతం జాఫ్నా కింగ్స్ 8 మ్యాచ్‌ల్లో 11 పాయింట్లతో ఎల్‌పీఎల్ పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది.




## ఇంగ్లండ్ కోచ్‌గా సేవలందించాలని ఉంది: స్టోక్స్

**లండన్:** ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్ భవిష్యత్‌లో జాతీయ జట్టుకు కోచ్‌గా బాధ్యతలు చేపట్టాలని తన ఆకాంక్షను వ్యక్తం చేశాడు. ప్రస్తుతం ఆడుతూనే లెవల్–3 కోచింగ్ కోర్సు పూర్తి చేస్తున్నానని, కెరీర్‌కు వీడ్కోలు పలికిన తర్వాత కోచ్‌గా కొనసాగాలని భావిస్తున్నట్లు తెలిపాడు. ఇంగ్లండ్ కోచ్‌గా అవకాశం వస్తే సమర్థంగా బాధ్యతలు నిర్వహించగలననే నమ్మకం తనకు ఉందని స్టోక్స్ పేర్కొన్నాడు. కెప్టెన్‌గా పనిచేసిన అనుభవం వల్ల కీలక నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెరిగిందని చెప్పాడు. వన్డే, టీ20 కెప్టెన్ హ్యారీ బ్రూక్‌ను అసాధారణ ప్రతిభ కలిగిన ఆటగాడిగా స్టోక్స్ అభివర్ణించాడు. నాయకత్వ లక్షణాలు ఉన్న ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని, బ్రూక్‌ను ఉప కెప్టెన్‌గా నియమించి కూడా కొన్ని సందర్భాల్లో నాయకత్వం ఇవ్వకపోవడం సరైన సందేశం కాదని వ్యాఖ్యానించాడు. 35ఏళ్ల స్టోక్స్ ఈ ఏడాది జూన్‌లో న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ అనంతరం అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 2019 వన్డే ప్రపంచకప్ విజయంలో, అదే ఏడాది యాషెస్ సిరీస్‌లో అతని మ్యాచ్ విజేత ఇన్నింగ్స్ చిరస్మరణీయంగా నిలిచాయి.







## ఆపిల్‌కు రూ.లక్ష కోట్ల ఆదాయం

- 2025–26లో 20శాతం వృద్ధి
- 24 శాతం పెరిగిన ఐఫోన్ విక్రయాలు




**న్యూఢిల్లీ:** భారత్‌లో ఆపిల్ సంస్థ 2025–26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో వృద్ధిని నమోదు చేసింది. కంపెనీ ఆదాయం 20 శాతానికి పైగా పెరిగి రూ.లక్ష కోట్ల మార్కుకు చేరువైనట్లు పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఆపిల్ ఇండియా ఏకీకృత ఆదాయం సుమారు రూ.79 వేల కోట్లు ఉండగా, తాజా ఆర్థిక సంవత్సరంలో అది దాదాపు రూ.లక్ష కోట్లకు చేరినట్లు సమాచారం. మార్కెట్ పరిశోధనా సంస్థ కౌంటర్‌పాయింట్ నివేదిక ప్రకారం, 2025–26లో భారత్‌లో ఐఫోన్ సరఫరాలు (షిప్‌మెంట్లు) 24 శాతం పెరిగి 1.4 కోట్ల (14 మిలియన్లు) యూనిట్లకు చేరాయి. ఆపిల్ భారత్ ఆదాయంలో అత్యధిక వాటా ఐఫోన్‌ల నుంచే వస్తోంది. కౌంటర్‌పాయింట్ సహ వ్యవస్థాపకుడు నీల్ షా మాట్లాడుతూ, ప్రీమియం స్మార్ట్‌ఫోన్‌ల వైపు వినియోగదారులు మొగ్గు చూపడం, దేశీయంగా ఐఫోన్ తయారీ పెరగడం, రిటైల్ నెట్‌వర్క్ విస్తరణ, సులభమైన ఫైనాన్సింగ్ సదుపాయాలు ఆపిల్ వృద్ధికి ప్రధాన కారణాలయ్యాయని తెలిపారు. దీంతో ఐఫోన్‌తో పాటు మ్యాక్ కంప్యూటర్లు, ఆపిల్ మ్యూజిక్ వంటి ఇతర సేవల వినియోగం కూడా పెరుగుతోందని పేర్కొన్నారు.

### స్థానిక తయారీతో ఊపు

ఐడీసీ ఇండియా విశ్లేషకుడు నవ్‌కేందర్ సింగ్ మాట్లాడుతూ, ప్రపంచంలో రెండో అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌గా ఉన్న భారత్‌లో ఆపిల్ మరోసారి రికార్డు ఆదాయాన్ని నమోదు చేసిందన్నారు. ప్రస్తుతం భారత్‌లో విక్రయించే ఐఫోన్‌లలో దాదాపు పావు వంతు దేశీయంగానే తయారవుతున్నాయని తెలిపారు. అయితే రాబోయే నెలల్లో సరఫరా పరిమితులు, అంతర్జాతీయంగా మెమరీ చిప్‌ల ధరలు పెరగడంతో ఐఫోన్ల ధరలు పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొన్నారు. అయినప్పటికీ భారత మార్కెట్‌లో డిమాండ్‌పై దాని ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని అంచనా వేశారు.

## డిజిటల్ మోసాలపై సుప్రీం కొరడా

- మ్యూల్ ఖాతాలపై ఎస్‌ఓపీ రూపొందించాలి • ఆర్‌బీఐకి సుప్రీంకోర్టు ఆదేశాలు
- సైబర్ మోసాల్లో బ్యాంకు ఖాతాల ఫ్రీజింగ్ కేసులను వేగంగా పరిష్కరించాలని సూచన

**న్యూఢిల్లీ:** సైబర్ ఆర్థిక మోసాలను అరికట్టేందుకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సైబర్ మోసాలకు వినియోగించే మ్యూల్ బ్యాంకు ఖాతాల నిర్వహణపై ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్‌ఓపీ) రూపొందించి దేశవ్యాప్తంగా అమలు చేయాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)ని మంగళవారం ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్ మాల్య బాగ్చీ, వి. మోహనతో కూడిన ధర్మాసనం డిజిటల్ మోసాల బాధితులకు ఫిర్యాదుల పరిష్కారం, డబ్బు తిరిగి పొందేందుకు రూపొందించిన ప్రత్యేక వ్యవస్థలను అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తక్షణమే అమలు చేయాలని ఆదేశించింది. ఈ వ్యవస్థలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కూడా సూచించింది.

### ఫ్రీజ్ ఖాతాల కేసులు పరిష్కరించాలి

సైబర్ మోసాల దర్యాప్తులో ఫ్రీజ్ చేసిన బ్యాంకు ఖాతాలకు సంబంధించిన కేసులను వేగంగా పరిష్కరించాలని కోర్టు ఆదేశించింది. అలాగే డిజిటల్ అరెస్టు మోసాలను అరికట్టేందుకు బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో సంప్రదింపులు జరిపి తగిన చర్యలు సూచించాలని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంతర్‌శాఖ కమిటీని ఆదేశించింది. రాష్ట్రాల వారీగా, బ్యాంకుల వారీగా నమోదైన, పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలతో నివేదిక సమర్పించాలని కూడా సంబంధిత అధికారులను సుప్రీంకోర్టు ఆదేశించింది.



## అదానీ పవర్‌లో రూ.2,627 కోట్ల షేర్ల బదిలీ

- ప్రమోటర్ సంస్థ ఆర్డర్ ఇన్వెస్ట్‌మెంట్ 0.65% వాటా విక్రయం
- అదే వాటాను కొనుగోలు చేసిన అదానీ ఇన్‌ఫ్రా (ఇండియా) లిమిటెడ్

**న్యూఢిల్లీ:** అదానీ పవర్ ప్రమోటర్ గ్రూప్‌కు చెందిన ఆర్డర్ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్ లిమిటెడ్ మంగళవారం ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా కంపెనీలోని 0.65 శాతం వాటాకు సమానమైన 12.48 కోట్ల షేర్లను రూ.2,627.04 కోట్లకు విక్రయించింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) బ్లాక్‌డీల్ గణాంకాల ప్రకారం, ఒక్కో షేరును సగటున రూ.210.50 ధరకు విక్రయించారు. ఈ లావాదేవీ అనంతరం ఆర్డర్ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్ లిమిటెడ్ వాటా అదానీ పవర్‌లో 3.68 శాతం నుంచి 3.03 శాతానికి తగ్గింది. విక్రయించిన 12.48 కోట్ల షేర్లన్నింటినీ అదానీ ఇన్‌ఫ్రా (ఇండియా) లిమిటెడ్ అదే ధరకు కొనుగోలు చేసింది. ఈ లావాదేవీతో అదానీ గ్రూప్‌లో అంతర్గతంగా వాటాల పునర్వ్యవస్థీకరణ కొనసాగుతున్నట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాల మధ్య అదానీ పవర్ షేరు మంగళవారం ఎన్ఎస్ఈలో దాదాపు 2 శాతం క్షీణించి రూ.209.95 వద్ద ముగిసింది.



## ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు అరుదైన ఘనత

- దమన్‌కు కొత్త సర్వీసులతో 90 దేశీయ గమ్యస్థానాలకు విస్తరణ
- 32 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ప్రత్యక్ష అనుసంధానం

**న్యూఢిల్లీ:** దమన్‌కు కొత్త విమాన సర్వీసులు ప్రారంభం కావడంతో ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దేశీయంగా నేరుగా అనుసంధానమయ్యే గమ్యస్థానాల సంఖ్య 90కి చేరినట్లు ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (డయల్) తెలిపింది. ఢిల్లీ–దమన్ మార్గంలో అలయన్స్ ఎయిర్ సేవలు నిర్వహిస్తోంది. దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 32 ప్రాంతాలకు ప్రత్యక్ష విమాన సౌకర్యం కల్పిస్తున్న ఏకైక విమానాశ్రయం ఢిల్లీదేనని డయల్ సీఈవో ప్రదీప్ పనిక్కర్ తెలిపారు. ప్రాంతీయ అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. డయల్ వివరాల ప్రకారం, ఢిల్లీ విమానాశ్రయం నుంచి రోజుకు 1,050కుపైగా దేశీయ విమానాలు నడుస్తుండగా, నెలకు 50 లక్షలకు పైగా ప్రయాణికులు సేవలు వినియోగిస్తున్నారు. 90 దేశీయ గమ్యస్థానాల్లో ఖజురాహో, జైసల్మేర్ శీతాకాల సీజనల్ సర్వీసులు కూడా ఉన్నాయి.

## నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్

- 210 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్, 24,615 దిగువకు నిఫ్టీ
- కొత్త క్లోజింగ్ వేలం విధానంతో మార్కెట్లో ఒడిదుడుకులు
- ఎఫ్అండ్ఓ షేర్లలో లాభాల స్వీకరణ ప్రభావం
- ఇన్సూరెన్స్, రియాల్టీ, ఐటీ రంగాలపై అమ్మకాల ఒత్తిడి

**ముంబై:** వరుసగా నాలుగు ట్రేడింగ్ సెషన్ల పాటు లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లకు మంగళవారం బ్రేక్ పడింది. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్ఓ) షేర్లకు కొత్తగా అమల్లోకి వచ్చిన క్లోజింగ్ ఆక్షన్ సెషన్ (సీఏఎస్) ప్రభావంతో పాటు భారీ షేర్లలో లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో ముగిశాయి. 30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 210.08 పాయింట్లు (0.27 శాతం) క్షీణించి 78,428.95 వద్ద స్థిరపడింది. రోజంతా తీవ్ర హెచ్చుతగ్గులకు లోనైన సూచీ గరిష్ఠంగా 79,143.15, కనిష్ఠంగా 78,211.87 స్థాయిలను తాకి మొత్తం 931 పాయింట్ల పరిధిలో కదిలింది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ 159.40 పాయింట్లు (0.64 శాతం) కోల్పోయి 24,614.90 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఒక దశలో 24,427.95 కనిష్ఠ స్థాయికి చేరింది.

### క్లోజింగ్ ఆక్షన్ ప్రభావం

ఈక్విటీ నగదు విభాగంలో అర్హత కలిగిన ఎఫ్అండ్ఓ షేర్ల ముగింపు ధరలను మరింత పారదర్శకంగా నిర్ణయించేందుకు స్టాక్ ఎక్స్ఛేంజీలు సోమవారం నుంచి క్లోజింగ్ ఆక్షన్ సెషన్‌ను అమల్లోకి తీసుకొచ్చాయి. కొత్త విధానం అమలైన రెండో రోజైన మంగళవారం కూడా మార్కెట్లు దానికి అనుగుణంగా తమ స్థానాలను సర్దుబాటు చేసుకున్నాయని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. ఎన్ఎస్ఈలో క్లోజింగ్ ఆక్షన్ సెషన్‌లో రూ.1,542.20 కోట్ల టర్నోవర్ నమోదుకాగా, బీఎస్ఈలో రూ.9.35 కోట్ల టర్నోవర్ నమోదైంది. తొలి రోజు ఎన్ఎస్ఈలో రూ.1,276.20 కోట్ల లావాదేవీలు జరిగాయి. సోమవారం కొత్త విధానం కారణంగా కొన్ని కీలక షేర్ల ముగింపు ధరలు పెరగడంతో, మంగళవారం పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపినట్లు హెచ్ఎస్‌టీ వెల్త్ వ్యవస్థాపకుడు హరిసెల్వన్ రాధాకృష్ణన్ తెలిపారు. ముఖ్యంగా నిఫ్టీలోని భారీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కనిపించిందని, ఇది ప్రాథమిక ఆర్థిక పరిస్థితుల్లో మార్పు కంటే మార్కెట్ సర్దుబాటు ప్రక్రియలో భాగమేనని వివరించారు. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ పరిశోధన విభాగాధిపతి వినోద్ నాయర్ మాట్లాడుతూ, వారాంతపు డెరివేటివ్స్ గడువు ముగింపు (వీక్లీ ఎక్స్‌పైరీ)తో పాటు కొత్త క్లోజింగ్ విధానం ప్రభావం కలిసివచ్చి మార్కెట్ ధోరణుల్లో తాత్కాలిక ఒడిదుడుకులు సృష్టించాయని పేర్కొన్నారు.





# ఇరుముడి నుంచి యాలాలో.. యాలాలో సాంగ్ రిలీజ్

మాస్ మహారాజా రవితేజ హీరోగా, కుటుంబ కథా చిత్రాల దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఇరుముడి' పై రోజురోజు అంచనాలు పెరుగుతున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ ఎమోషనల్ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతుండటంతో ప్రమోషన్లను మేకర్స్ వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో చిత్రం నుంచి రెండో సింగిల్ 'యాలాలో యాలాలో.. వెన్నెల్లో ఎన్నెన్ని ముచ్చట్లో..' అనే మధురమైన ఫ్యామిలీ మెలోడీని విడుదల చేశారు. కుటుంబ బంధాలు, ఆప్యాయత, భావోద్వేగాలను ప్రతిబింబించేలా రూపొందిన ఈ పాట తొలి వినికిడిలోనే ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ పాటకు ప్రముఖ గేయ రచయిత అనంత శ్రీరామ్ హృదయాన్ని హత్తుకునే సాహిత్యం అందించగా, సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ తన మెలోడీ స్వరాలతో పాటను మరింత అందంగా తీర్చిదిద్దారు. విడుదల చేసిన పోస్టర్‌లో రవితేజ తన కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా కనిపించడం సినిమా భావోద్వేగ నేపథ్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఇప్పటి విడుదలైన తొలి పాట 'ఇరుముడి కట్టు' భక్తి గీతంగా మంచి ఆదరణ పొందింది. యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలిచిన ఆ పాట తర్వాత ఇప్పుడు 'యాలాలో యాలాలో'తో సినిమా మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. 'ఇరుముడి'లో రవితేజ ఇప్పటివరకు చేయని ఓ విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారని చిత్రబృందం చెబుతోంది. తండ్రీ?తుళ్ల అనుబంధాన్ని ప్రధానాంశంగా తీసుకున్న ఈ కథలో అయ్యప్ప స్వామి దీక్షకు డా కీలక ప్రాధాన్యం ఉంది. తన తురి కోసం జీవితాన్ని మార్చుకునే ఓ తండ్రి ప్రయాణాన్ని భావోద్వేగభరితంగా చూపించనున్నట్లు తెలుస్తోంది.





# విజయ్ దేవరకొండతో కిస్ సీన్ చేయాలనుంది

టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ చిత్ర సీమల్లో దాదాపు రెండు దశాబ్దాలుగా స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి తమన్నా భాటియా మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. అందం, అభినయం, గ్లామర్‌తో ప్రేక్షకులను అలరిస్తూ స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతున్న తమన్నా కెరీర్ ప్రారంభం నుంచి కొన్ని విషయాల్లో తనకంటూ ప్రత్యేక నిబంధనలు పెట్టుకున్నారు. ముఖ్యంగా తెరపై లిప్‌లాక్, ఇంటిమేట్ సన్నివేశాల్లో నటించబోనని ఆమె చాలా కాలం పాటు స్పష్టంగా చెప్పేవారు. కథ ఎంత పెద్దదైనా, హీరో ఎంత స్టార్ అయినా ఆ నిర్ణయానికి కట్టుబడి ఉండేవారు. అయితే కాలక్రమేణా సినిమా కథల తీరు, ప్రేక్షకుల అభిరుచులు మారడంతో తమన్నా కూడా తన నిర్ణయాన్ని కొంతవరకు మార్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమె కెరీర్‌లో పెద్ద చర్చకు దారితీసిన ప్రాజెక్ట్ 'లస్ట్ స్టోరీస్ 2'. ఈ వెబ్ ఫిల్మ్‌లో నటుడు విజయ్ వర్మతో కలిసి లిప్‌లాక్, రొమాంటిక్ సన్నివేశాల్లో నటించడం అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది. అంతేకాదు, ఈ ప్రాజెక్ట్ షూటింగ్ సమయంలోనే ఇద్దరి మధ్య స్నేహం ప్రేమగా మారిందనే వార్తలు కూడా బలంగా వినిపించాయి.ఆ తర్వాత తమన్నా, విజయ్ వర్మ పలుమార్లు కలిసి పార్టీల్లో, సినిమా వేడుకల్లో, విదేశీ వెకేషన్లలో కనిపించడంతో వారి రిలేషన్‌షిప్‌ను దాదాపు అధికారికంగానే అందరూ భావించారు. త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారనే ప్రచారం కూడా జోరుగా సాగింది. అయితే కొంతకాలానికే ఇద్దరూ విడిపోయారనే వార్తలు బయటకు వచ్చాయి. బోల్డ్ కంటెంట్‌కు ప్రాధాన్యం ఉన్న ప్రాజెక్ట్‌లలో కూడా నటించేందుకు సిద్ధంగా ఉన్నారని, ముఖ్యంగా 'రాగిణి ఎంఎం 3'లో ఆమె నటించనున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన మాత్రం ఇంకా వెలువడలేదు. ఇదిలా ఉండగా, ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ వీడియో మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ వీడియో చాలా ఏళ్ల క్రితం ప్రముఖ నటి సమంత హోస్ట్‌గా నిర్వహించిన 'సామ్ జామ్' టాక్ షోకు సంబంధించినది. ఆ కార్యక్రమంలో ర్యాపిడ్ ఫైర్ రౌండ్ సందర్భంగా సమంత, "ఒకవేళ తెరపై కిస్ సీన్ చేయాల్సి వస్తే ఏ హీరోతో చేయాలని అనుకుంటారు?" అని ప్రశ్నించగా, తమన్నా ఏమాత్రం ఆలస్యం చేయకుండా "విజయ్ దేవరకొండ" అని సమాధానం ఇచ్చారు. అప్పుడు సరదాగా చెప్పిన ఆ సమాధానం ఇప్పుడు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నెటిజన్లు ఈ వీడియోను విస్తృతంగా షేర్ చేస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తున్నారు. దీంతో తమన్నా పేరు మరోసారి సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది.

# అతీంద్రియ శక్తుల కథ.. అగధ

ప్రముఖ నిర్మాత, దర్శకుడు ఎంఎస్ రాజు మరో విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న మిస్టికల్ థ్రిల్లర్ 'అగధ' ఇప్పటి సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తుండగా, తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు నిర్మిస్తున్నారు. ఆగస్టు 14న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం వేగవంతం చేసింది. అందులో భాగంగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను థ్రిల్లింగ్ ప్రపంచంలోకి తీసుకెళ్తోంది.ట్రైలర్ ప్రారంభం నుంచే మిస్టరీ, ఆధ్యాత్మికత, మంత్ర తంత్రాల నేపథ్యాన్ని ఆసక్తికరంగా పరిచయం చేశారు. 'మంత్ర తంత్ర విద్యలకు అందని శక్తి ఉంది? దాని గురించి నాకు తెలియాలి' అంటూ కామాక్షి భాస్కర్ల చెప్పే డైలాగ్ ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమాలో అతీంద్రియ శక్తులు, రహస్యాల చుట్టూ తిరిగే కథ ఉండబోతుందనే సంతాలు ఇచ్చారు. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సినిమాటోగ్రఫీ ట్రైలర్‌కు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఉత్కంఠను పెంచేలా ఎంఎస్ రాజు కథనాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. మిస్టరీతో పాటు భావోద్వేగాలు, సస్పెన్స్ అంశాలను సమతూకంగా మేళవించినట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కామాక్షి భాస్కర్ల తన పాత్రలో ఎంతో ఎమోషన్‌ను ప్రదర్శించగా, శ్రవణ్ రెడ్డి డా కథలో కీలకమైన పాత్రలో ఆకట్టుకునేలా కనిపిస్తున్నారు. వీరితో పాటు ఇతర నటీనటులు డా కథకు తగ్గట్టుగా తమ పాత్రలకు న్యాయం చేసినట్లు ట్రైలర్ ద్వారా అర్థమవు తోంది. ఎంఎస్ రాజు గతంలో కుటుంబ కథా చిత్రాలు, ప్రేమకథలతో విజయాలు అందుకున్నప్పటికీ, ఈసారి పూర్తిగా భిన్నమైన జానర్‌ను ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది. అతీంద్రియ శక్తులు, మంత్ర తంత్రాలు, పురాతన రహస్యాల నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందనే నమ్మకంతో చిత్రబృందం ఉంది. ఇప్పటి ట్రైలర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. విజువల్స్, కాన్సెప్ట్, కామాక్షి భాస్కర్ల నటనపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# స్పైడర్ మ్యాన్ కలెక్షన్ల దూకుడు



టామ్ హాలెండ్, జెండయా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' జులై 30న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా రికార్డులు తిరగరాస్తోంది. మొదటి వారంలోనే 900 మిలియన్ డాలర్లలకు పైగా వసూళ్లు చేసినట్లు టీమ్ పేర్కొంది. ఇప్పటి వర బాక్సాఫీస్ వద్ద 927 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.8,830 కోట్లు) వసూళ్లు చేసింది. దీంతో ప్రపంచ సినిమా చరిత్రలోనే రెండో అతిపెద్ద గ్లోబల్ ఓపెనింగ్ సాధించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. సుమారు 225 మిలియన్ డాలర్లతో (సుమారు రూ.2,100కోట్లు) రూపొందిన ఈ సినిమా, విడుదలైన మొదటి వీకెండ్‌లోనే బ్జడెట్‌ను అధిగమించి భారీ విజయాన్ని నమోదు చేసింది. 2019లో వచ్చిన 'అవెంజర్స్: ది ఎండ్‌గేమ్' (1.2 బిలియన్ డాలర్లు) (రూ.11వేల కోట్లు) వసూళ్లు చేసి దీని కంటే ఎక్కువ ఓపెనింగ్ సాధించిన చిత్రంగా మొదటి స్థానంలో ఉంది. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో 38వ చిత్రంగా తెరకెక్కిన 'స్పైడర్ మ్యాన్'కు ఇండియాలోనూ మంచి ఆదరణ లభిస్తోంది. ఇక్కడ ఈ చిత్రానికి రూ.310కోట్లు వచ్చినట్లు మూవీ టీమ్ వెల్లడించింది. ఇక ఈ డిసెంబర్‌లో మార్వెల్ స్టూడియోస్ నుంచి రానున్న 'అవెంజర్స్: డూమ్స్‌డే'కు ముందు ఈ 'స్పైడర్ మ్యాన్' బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలవడంతో భారీ ఉత్సాహం నెలకొంది.

# 14న విశ్వనాథ్ అండ్ సన్స్

ప్రముఖ నటుడు సూర్య, మమితా బైజు ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఆగస్టు 14న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఆడియో విడుదల వేడుకలో హీరో సూర్య ప్రేమ, పెళ్లి, దంపతుల మధ్య పరస్పర గౌరవం గురించి మాట్లాడారు. ప్రేమ అనేది పెళ్లితో ముగిసిపోయేది కాదు. బంధంలో అనురాగం ప్రతిరోజూ వ్యక్తమవ్వాలి. భాగస్వామిని జీవితాంతం ప్రతి రోజూ ప్రేమిస్తూనే ఉండాలి. ఆమెతో 20 ఏళ్లు గడిపినా డా ప్రేమ తగ్గడదు. ఎప్పుడూ ఒకరికొకరు గౌరవించుకోవాలి. వయసు పెరిగే కొద్దీ మనుషుల్లో మార్పులు సహజం. 25, 30 ఏళ్ల వయసులో ఉండే ఆలోచనలు, ప్రాధాన్యతలు తర్వాత మారిపోతాయి. జీవితం ఎలా ఉన్నా.. మన భాగస్వామిపై ఉండే ప్రేమ, ఆప్యాయత మాత్రం ఎప్పటికీ మారడదని చెప్పారు. సమాజంలో, కుటుంబంలో మహిళల పాత్రను, వారి త్యాగాలను సూర్య ప్రస్తావించారు. 'ప్రతి కుటుంబంలో పురుషుడి కంటే మహిళలు ఎక్కువ కష్టపడతారు. ఇల్లు చూసుకోవడం, పిల్లలకు జన్మనివ్వడం వంటి విషయాల్లో వారు ఎన్నో త్యాగాలు, సర్దుబాట్లు చేస్తారు. వాటికి ఎప్పుడూ గౌరవం ఇవ్వాలి. ప్రేమ పంచడంతో పాటు వాళ్లకు గౌరవం ఇవ్వడమూ ముఖ్యమని సూర్య చెప్పారు.ఈ కార్యక్రమంలో హీరోయిన్ మమితా బైజుమాట్లాడుతూ, చిన్నప్పటి నుంచి తనకు సూర్య అంటే ఎంతో ఇష్టమని వెల్లడించారు. 'గతంలో సూర్యతో పనిచేసే మంచి అవకాశాన్ని కోల్పోయాను. కానీ దేవుడి దయ వల్ల ఈ సినిమాలో నటించే ఛాన్స్ వచ్చింది.

# నితిన్ హీరోగా నాని మూవీ



హీరోగా వరుస విజయాలతో దూసుకుపోతూనే, అభిరుచి గల చిత్రాలను నిర్మిస్తూ నిర్మాతగానూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు నేచురల్ స్టార్ నాని. ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. తాజాగా నాని సమర్పణలో హీరో నితిన్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న కొత్త చిత్రానికి 'అలియాస్ రుక్మిణీ ' అనే విభిన్నమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ చిత్రబృందం ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది.ఈ చిత్రానికి యువ దర్శకుడు మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. కథలో కొత్తదనం, ఆసక్తికరమైన కాన్సెప్ట్ ఉన్నట్లు టైటిల్ గ్లింప్స్ ద్వారా మేకర్స్ హింట్ ఇచ్చారు. ముఖ్యంగా ఈ వీడియోకు నాని అందించిన వాయిస్ ఓవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్లింప్స్ ప్రారంభంలో నితిన్ ఇంజినీరింగ్ పుస్తకాల మధ్య నిద్రపోతూ కనిపిస్తాడు. అయితే అతని ముందు కనిపించే పుస్తకాల పేర్లు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. 'గరం గోపాల్', 'ఆమెకు ఆమెంటే ఇష్టం', 'వత్రం వెంకన్న' వంటి వినూత్న శీర్షికలతో ఉన్న పుస్తకాలను చూపిస్తూ వాటి రచయితగా 'రుక్మిణి' అనే పేరును ప్రస్తావిస్తారు. దీంతో ఈ రుక్మిణి ఎవరు? అనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరుగుతుంది.ఆ సమయంలో నాని వాయిస్ ఓవర్‌లో రుక్మిణి గురించి వివరిస్తుండగా, చివర్లో నితిన్ 'ఆమె నా భార్య' అని చెప్పడం గ్లింప్స్‌కు ఆసక్తికర ముగింపునిచ్చింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమా కథపై మరింత ్యరియాసిటీ పెరిగింది. 'అలియాస్ రుక్మిణి' అనే టైటిల్ వెనుక ఉన్న రహస్యం ఏమిటి? రుక్మిణీ పాత్ర కథలో ఎంత కీలకమనే అంశాలపై చర్చ మొదలైంది. నితిన్ కెరీర్‌లో ఇది మరో విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రం అని తెలుస్తోంది. రొమాన్స్, కామెడీ, ఎమోషన్స్‌తో పాటు ఒక ప్రత్యేకమైన కాన్సెప్ట్‌ను ఈ సినిమాలో మేకర్స్ చూపించబోతున్నట్లు గ్లింప్స్ ద్వారా అర్థమవుతోంది.నాని సమర్పణలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటి మంచి అంచనాలు ఏర్పడ్డాయి. గతంలో నాని నిర్మాణంలో వచ్చిన పలు చిత్రాలు విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రేక్షకాదరణ కూడా పొందాయి. త్వరలోనే హీరోయిన్, ఇతర నటీనటులు, విడుదల తేదీకి సంబంధించిన పూర్తి వివరాలను చిత్రబృందం ప్రకటించనుంది. టైటిల్ గ్లింప్స్‌తోనే ఆసక్తిని పెంచిన 'అలియాస్ రుక్మిణి' ప్రేక్షకులను ఏ స్థాయిలో అలరిస్తుందో చూడాలి.



# 41 గంటలు నిద్ర లేకుండా.. 20 గంటల నాన్‌స్టాప్ షూటింగ్

జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేశ్ తన కఠినమైన వర్క్ షెడ్యూల్‌తో మరోసారి వార్తల్లో నిలిచారు. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె పంచుకున్న పోస్టు అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది. వరుస చిత్రీకరణలతో ఎంత బిజీగా ఉన్నారో ఆమె ఆ పోస్టు ద్వారా వెల్లడించారు. కీర్తి తెలిపిన వివరాల ప్రకారం, ఆమె ఏకంగా 20 గంటల పాటు నిరంతరాయంగా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఉదయం 6 గంటలకు షూటింగ్‌కు వెళ్లిన ఆమె, మరుసటి రోజు ఉదయం 6 గంటలకు మాత్రమే హోటల్‌కు చేరుకున్నారు. అంతేకాదు, మొత్తం 41 గంటల పాటు నిద్ర లేకుండానే ఒక షూటింగ్ నుంచి మరో షూటింగ్‌కు వెళ్లినట్లు వెల్లడించారు. నిన్న ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేసేంత ఓపిక కూడా లేదు. 41 గంటలు మెలకువగా ఉన్నా, తదుపరి షూట్‌కు వెళ్లేముందు మిర్రర్ సెల్ఫీ తీసుకునేంత ఉత్సాహం మాత్రం ఉంది అంటూ ఆమె సరదాగా పేర్కొన్నారు. జీవితంలో ఇంత బిజీగా ఉండటం కూడా ఒక వరమేనని, దాన్ని తాను ఆస్వాదిస్తున్నానని చెప్పారు. మరో షూటింగ్‌కు వెళ్తూ ధరించిన టీ–షర్ట్‌పై ఉన్న 'ఐ విల్ సర్వైవ్' అనే సందేశాన్ని చూపిస్తూ, ఈ రోజు ఈ మాటకు అసలైన అర్థం తెలిసింది అని కీర్తి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కీర్తి సురేశ్ చేతిలోసత్యవాన్ సావిత్రి,రఫ్తార్,అక్క,రౌడీ జనార్ధన, అలాగే వెంకటేష్–అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం సహా పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు ఉన్నాయి. వరుస సినిమాల కారణంగా ఆమె తీరికలేని షెడ్యూల్‌తో బిజీగా గడుపుతున్నారు. ఆమె వృత్తిపట్ల ఉన్న నిబద్ధతను అభిమానులు, నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

# ఎల్లమ్మలో పర్శిగా దేవిశ్రీప్రసాద్ లుక్ విడుదల



దిల్ రాజు సమర్పణలో, 'రాక్‌స్టార్' దేవి శ్రీ ప్రసాద్, వేణు యెల్దండి, శిరీష్, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ 'ఎల్లమ్మ' నుంచి పర్శిగా దేవి శ్రీ ప్రసాద్ ఫస్ట్ లుక్ రిలీజ్ అయ్యింది. బలగంతో క్రేజ్ సంపాదించుకున్న దర్శకుడు వేణు యెల్దండి మరో ప్రతిష్టాత్మక చిత్రం ఎల్లమ్మను నిర్మిస్తున్నాడు. గతకొంతకాలంగా ఎల్లమ్మపై అనేక ఊహాగానాలకు తెరదించుతూ.. దేవిశ్రీప్రసాదన్‌ను హీరోగా ఎంపిక చేశారు. ఇందులో పర్శిగా అతను లుక్‌ను విడుదల చేశారు.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.